ప్రజాశక్తి

గురువారం 1 డిసెంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



యథేచ్ఛగా గెడ్డలు కబ్జా

- వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు
- చెరువుల్లోకి చేరని నీరు
- ఎండమావిగా భూగర్భజలాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పరవాడ

కబ్జారాయుళ్ల అక్రమాలకు ఆకాశమే హద్దుగా మారిపోయింది. ప్రభుత్వానికి చెందిన భూములని తెలిసికూడా బరితెగిస్తున్నారు. సర్వే నెంబర్లు, ఎఫ్ఎంబిలు, మ్యాప్‌లు, రికార్డులు ఉన్నా సరే రెవెన్యూ శాఖ కింద స్థాయి ఉద్యోగులకు అమ్యామ్యాలు అందించి వారి సహకారంతో కబ్జాకు వెనుకాడడం లేదు. పరవాడ మండల పరిధిలో వివిధ రెవెన్యూ గ్రామాల్లో గెడ్డలు కప్పేస్తున్నా, చెరువుల్లో రోడ్లు నిర్మించినా ఇటు రెవెన్యూ, అటూ ఇరిగేషన్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కబ్జాలకు అధికారపార్టీ అండదండలు పుష్కలంగా ఉండడంతో యథేచ్ఛగా సాగిపోతున్నాయి. వైసిపి పాలనలో కొంతమందిపై భూ, ఆర్థిక లావాదేవీల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో ఇటీవల ఈ ఆరోపణలు మరింతగా పెరగడంతో వైసిపి ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తప్పడంలేదు. ముఖ్యంగా వర్షపు నీరు ప్రవహించే సహజ సిద్ధమైన వాగులు, గెడ్డలు ఆక్రమణకు గురవడంతో చెరువుల్లోకి నీరు చేరక భూగర్భజలాలు ఎండిపోతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ, చెరువుల్లోకి నీరు చేరడంలేదు. భవిష్యత్తులో గెడ్డలు, వాగులు, చెరువులు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది.

పరవాడ మండలం దేశపాత్రునిపాలెం గ్రేటర్ విశాఖ 79వ వార్డులో సర్వే నెంబర్ 305/1లో పూర్తి విస్తీర్ణం 28.83 ఎకరాల్లో గెడ్డ ఉంది. దీనిలో సుమారు 2ఎకరాల గెడ్డను రాత్రి సమయంలో కబ్జాదారులు చదును చేసి మూసేశారు. సుమారు రూ.14.4కోట్లు విలువైన స్థలం కబ్జాకి గురవుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. గెడ్డలు, వాగులు, చెరువుల్లో ఉన్న ఆక్రమణలను తొలగించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు కబ్జారాయుళ్లకు సలాం కొడుతున్నారు. గెడ్డలు, వాగులు, చెరువులు అంతరించిపోకుండా వాటిని కాపాడాలని, వాటిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. పరవాడ మండలం పారిశ్రామిక ప్రాంతం కావడం గ్రామీణ ప్రాంతంతో పాటు గ్రేటర్ విశాఖ నగరానికి అనుకొని విలువైన ప్రభుత్వ భూములు ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో భూముల విలువ విపరీతంగా పెరిగింది. దీంతో ప్రభుత్వ బంజరు, కొండపోరంబోకు భూములు, గెడ్డలు, వాగులు, చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. దీనివల్ల నాలుగు రకాల నష్టాలు జరుగుతున్నాయి. ఒకటి సాగునీటి చెరువుల్లోకి వర్షపునీరు చేరకపోవడం, రెండోది నీటి ప్రవాహాన్ని మళ్లించడం ద్వారా కొద్దిపాటి వర్షానికే నివాస ప్రాంతాలను వరద

మిగతా 2లో..



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ తదితరులు

గురజాడ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

మనుషులను ప్రేమించాలని, మంచితనాన్ని పెంపొందించాలని, దేశమంటే మట్టికాదోయ్, మనుషులు అని చెప్పిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. మహాకవి గురజాడ అప్పారావు 107వ వర్ధంతి సందర్భంగా బుధవారం సాహితీ స్రవంతి ఆధ్వర్యాన విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న గురజాడ విగ్రహ కూడలిలో సమావేశమయ్యారు. గురజాడ రాసిన దేశమును ప్రేమించుమన్నా దేశభక్తి గేయాన్ని సామూహికంగా ఆలపించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి ఎంవిఎస్.శర్మ పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, వ్యవహారిక భాష ఉద్యమకారులైన గిడుగు, కందుకూరి, గురజాడ ఉత్తరాంధ్రకే చెందిన వారవడం మనందరికీ ఎంతో గర్వకారణమన్నారు. 112 ఏళ్ల క్రితమే దేశమును ప్రేమించుమన్నా అనే దేశభక్తి గేయాన్ని గురజాడ రాశారని తెలిపారు. శ్రమజీవుల చెమట చుక్కల వల్లనే సంపద సృష్టి అవుతుందన్నారని పేర్కొన్నారు. మహాకవి వర్ధంతి సందర్భంగా ఆయన భావజాలాన్ని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లే ప్రతిజ్ఞ పూనుదామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల అప్పలరాజు (అరసం), రామకృష్ణ (విశాఖ రచయితల సంఘం), పి.రామారావు (సాహితీ స్రవంతి), జి.రాజేశ్వరరావు (అల్లూరి విజ్ఞాన కేంద్రం), గ్రంథాలయ

మిగతా 2లో..



వార్త 5లో..

నిర్వాసిత గ్రామాల పెద్దలతో చర్చిస్తున్న కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

జెట్టీ నిర్మాణం సాధ్యం కాదు : కలెక్టర్

విద్యా దీవెనకు రూ.32.35 కోట్లు

వార్త 2లో..

జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎసిబి సోదాలు

వార్త 2లో..



నిరసన జాగరణలో కూర్చున్న యుటిఎఫ్ నాయకులు, మద్దతుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

హక్కుల కోసం పోరాడితే అక్రమ అరెస్టులు దుర్మార్గం

నిరసన జాగరణలో యుటిఎఫ్ నాయకులు

వార్త 8లో..

తప్పని కుదుపులు

మరమ్మతుకు నోచని రహదారులు



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రహదారుల గోతులు పూడ్చడంలేదు. వాహన ప్రయాణికులకు కుదుపులు తప్పడంలేదు. ఎటు నుంచి సురక్షితంగా వెళ్దామన్నా పెద్దపెద్ద గొయ్యిల నుంచి తప్పించుకొని వెళ్లిరాలేని దుస్థితి ప్రయాణికులకు ఎదురవుతోంది. మంజూరైన పనులు త్వరితగతిన పూర్తికావడంలేదు. ప్రతి పనికీ ఒక దశ ఉంటుందని, అవన్నీ పూర్తయి పనులు జరిగే నాటికి కొంత సమయం పడుతుందని అధికారులు చెప్పుకొస్తున్నారు తప్ప పనులు పూర్తిచేసి, ప్రయాణ అవస్థలు తప్పించే పని చేయడంలేదు. నిధులు కొరత లేవంటున్నా, పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురావడంలేదు. ఆర్అండ్‌బి పరిధిలోని 73 రహదారుల మరమ్మతులకు రూ.82 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు టెండర్లు ప్రక్రియ పూర్తయినా రూ.59.51 కోట్ల విలువైన 56 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు సాగుతున్నాయి. పీరియాడిక్ రెన్యూవల్స్ కింద చేపట్టిన పనులు ఇంకా పూర్తికాలేదు. సెంట్రల్ రోడ్ ఫండ్ కింద మంజూరైన ఆరు పనులకు రెండు పనులింకా ప్రారంభించలేదు. మూడు పనులు ఆయా స్థాయిలో ఉన్నాయి. ఒకటి మాత్రమే పూర్తిచేశారు. ఎస్‌డిబి కింద రూ.138.68 కోట్లతో మంజూరైన 10 పనుల్లో మూడు పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తికాకపోవడానికి సాంకేతిక, ఇతర ఇబ్బందులు అధికారులు చెబుతున్నారు. పంచాయతీరాజ్‌శాఖ పరిస్థితి ఇందుకు భిన్నంగాలేదు. రూ.71.70 కోట్లతో 261 కిలోమీటర్లలో 89 రోడ్డు పనులకు పరిపాలనామోదం లభించింది. 20 ప్యాకేజీల కింద చేపట్టాల్సిన ఎనిమిదింటికి పనుల ఒప్పందం జరిగింది. 12 ప్యాకేజీలు టెండర్ల దశలో ఉన్నాయి. ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రహదారుల మరమ్మతులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులకు రోజూ అవస్థలు తప్పడంలేదు. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఈ రెండు శాఖలకూ గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ భరోసా

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

యథేచ్ఛగా గెడ్డలు కబ్జా

నీరు ముంచెత్తడం, మూడు నీరు నిల్వ లేకపోవడంతో భూ గర్భజలాలు ఎండిపోవడం, నాలుగు భవిష్యత్తులో గెడ్డలు, వాగులు, చెరువులు కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తున్నాయి. వీటిని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ఉపాధి హామీ పథకం కింద పనులు

కొన్ని రెవెన్యూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహించేటప్పుడు గెడ్డలు, వాగులు, చెరువుల్లో ఆక్రమణలను తొలగించాలని నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు అమలు చేయలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే ఇందుకు కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇరిగేషన్‌శాఖ పరవాడ తహశీల్దార్‌కు రాసిన లేఖలు

గెడ్డలు, వాగులు, చెరువులు కబ్జా కావడంతో పత్రికల్లో వచ్చిన కథనాలకు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరవాడ తహశీల్దార్‌కు లేఖలు రాస్తున్నారు. రావాడ రెవెన్యూ సంబంధించి సర్వే నెంబర్ 443లో సీతం చెరువులో ఉన్న అక్రమ నిర్మాణాలు, చెరువు గర్భంలో వేసిన రోడ్డును తొలగించాలని ఎల్.ఆర్.నెం.86ఎస్ 2022 ఆగస్టు 3వ తేదీన తహశీల్దార్‌కు ఇరిగేషన్ శాఖ లేఖ రాసింది.

ఇ.బోనంగి పంచాయతీలో లే-అవుట్‌కు వేసిన రోడ్డుకు సంబంధించి జాయింట్ సర్వే కోసం అనుమతులు రద్దుచేయాలని కోరుతూ ఎల్.ఆర్.నెం.85ఎస్ 2022 ఆగస్టు 3వ తేదీన తహశీల్దార్‌కు ఇరిగేషన్ శాఖ లేఖ రాసింది. నేటికి కూడా ఆ లేఖలకు పరవాడ తహశీల్దార్ స్పందించలేదు. దీంతో మండలంలో అనేక చోట్ల కబ్జారాయళ్లకు అడ్డులేకుండా పోయింది.

ఇరిగేషన్ శాఖ వివరణ

మండలంలో గెడ్డలు కబ్జాకు సంబంధించి ఇరిగేషన్ శాఖ ఎఇ శ్రీనివాస్‌ను ప్రజాశక్తి సంప్రదించగా కబ్జాలపై చర్యలు తీసుకోవాలని పరవాడ రెవెన్యూ అధికారులకు లేఖలు రాశామని, తహశీల్దార్ స్పందించడం లేదని చెబుతున్నారు. దేశపాత్రునిపాలెం సర్వే నెంబర్ 305/1లో సుమారు 2 ఎకరాల గెడ్డ కబ్జాకు గురయినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ విషయమై చర్యల కొరకు తహసీల్దార్ కు మరో లేఖ రాస్తున్నట్లు ప్రజాశక్తికి తెలిపారు.

పరవాడ తహశీల్దార్ వివరణ

మండలంలో గెడ్డలు కబ్జాపై ఇరిగేషన్ రాసిన లేఖలపై పరవాడ తహశీల్దార్ వి.ప్రకాశరావును ప్రజాశక్తి వివరణ కోరగా.. గెడ్డలు కబ్జాపై ఇరిగేషన్ అధికారులు లెటర్లు రాసేసి వదిలేస్తున్నారని, చర్యలకు వారు రావడం లేదని తహశీల్దార్ తెలిపారు. దేశపాత్రునిపాలెం సర్వే నెంబరు 305/1లో సుమారు రెండు ఎకరాలు గెడ్డను చదును చేసివారిని గుర్తించి క్రిమినల్ కేసులు పెడతామని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

గురజాడ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

పరిరక్షణ సంస్థ కార్యదర్శి బి.ఎల్ నారాయణ, ఐద్వా నాయకులు బి.పద్మ, వై.సత్యవతి, మణి, వరలక్ష్మి, పద్మజ, కుమారి, సంతోషం, కె.నిర్మల (అరుణోదయ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశభక్తి గేయంతోబాటు మరికొన్ని అభివృద్ధి గీతాలను ప్రజానాట్యమండలి ప్రతినిధులు ఎన్‌వి.రమణ, ఎం.చంటి బృందం సభ్యులు ఆలపించారు.

తప్పని కుదుపులు

కేంద్రాలు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు, వైఎస్ఆర్ డిజిటల్ గ్రంథాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణాలు ఉండడంతో రహదారుల పనుల్లో జాప్యం జరుగుతోంది.

'కందుల సేవలు ఆదర్శనీయం'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కెఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, 32 వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు సేవలు ఎంతో మందికి ఆదర్శం అని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. బుధవారం అల్లిపురంలోని తన నివాసములో కెఎన్ఆర్ చారిటబుల్ ట్రస్టు 28వ వార్షికోత్సవ వేడుకలు, అతని పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై కందుల నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కందుల నాగరాజు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి ఆదరాభిమానాలు పొందుతున్నారన్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లడుతూ, వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం కందుల నాగరాజు, నళిని దంపతులను వీరంతా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 10 వేల మందికి చీరలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మ కర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పోరాటం చారిత్రాత్మకం : ఐద్వా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం సాగిన పోరాటం చారిత్రాత్మకమైనది, ఈ వాస్తవాన్ని విస్మరించి దానిని ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి హెచ్చరించారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 608వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఐద్వా నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్లాంటును కాపాడుకోవడం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామని స్పష్టంచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం 32మంది బలిదానం చేశారని, వేలాది ఎకరాల భూమిని నిర్వాసితులు త్యాగం చేశారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేస్తూ లాభాల్లో నడుస్తుందన్నారు. అటు వంటి సంస్థను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు యత్నిస్తుందని విమర్శించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి ఉందని, అందరూ ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ దీక్షలో ఆర్.వరలక్ష్మి, కె.మణి, కె.కుమారి, బి.భారతి, డి.కొండమ్మ, ఆర్.విమల పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న ఐద్వా నాయకులు, కార్యకర్తలు

జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం ఒక్కసారిగా ఎసిబి అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆరోగ్యశాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వానికి అందిన ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా ఎసిబి అధికారుల బృందం విచారణ ప్రారంభించారు. కార్యాలయ ఉన్నతాధికారి ప్రస్తుతం సెలవులో ఉండటంతో కార్యాలయ, పరిపాలన అధికారి సుమతి వద్దకు వెళ్లి పలు రికార్డులను పరిశీలించారు. ఏ కేసు నిమిత్తం విచారణ చేస్తున్నారో? ఎవరి గురించి చేస్తున్నారో తెలియక ఉద్యోగులంతా కాస్త కంగారు పడ్డారు. ప్రభుత్వానికి అందిన ఫిర్యాదు మేరకు విచారణకు విచ్చేసిన ఏసీబీ సిఐ రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్యశాఖలో గతంలో జరిగిన అక్రమాలపై ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, ఈ నేపథ్యంలోనే రికార్డులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ విచారణ ప్రక్రియంతా సుమారు 30 రోజులు పడుతుందని, దాదాపుగా 30 మంది ఉద్యోగులను పలు అంశాల వారీగా విచారణ చేయాల్సి ఉందని తెలిపారు. ముఖ్యంగా జనరల్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ఆక్రమాలపై తొలుత ఎసిబి అధికారులు విచారణ చేపడుతున్నట్టు సమాచారం. ఉద్యోగుల శిక్షణ పేరుతో జరిగిన అవినీతి, ఇతర పదోన్నతులు, తాజాగా జరిగిన నియామకాలు తదితరాలపై విచారణ చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని సిఐ తెలిపారు.

విద్యా దీవెనకు రూ.32.35 కోట్లు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జగనన్న విద్యా దీవెన కార్యక్రమం కింద జులై -సెప్టెంబర్ త్రైమాసికానికి విశాఖ జిల్లా రూ.32,35,09,615 మొత్తాన్ని చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 47,775 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. విద్యార్థులకు విద్యా దీవెనకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లకు తెలియజేస్తే పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ కొండా రమాదేవి, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు తదితరులు పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి ఆలయంలో అన్నవరం ఈఓ దంపతులు

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న అన్నవరం ఈఓ దంపతులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని అన్నవరం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్‌విఎస్ఎన్ మూర్తి సతీసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు ముష్టి భీమశంకరశాస్త్రి, లక్ష్మీనారాయణ వేదాశీర్వచనం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి శ్రీనివాసరావుమూర్తి దంపతులచే పూజలు చేయించారు. ఆలయ ఎఇఒ వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

నేవీ డే ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-విశాఖపట్నం : నేవీ డే సందర్భంగా ఈ నెల 4వ తేదీన నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, నేవల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్కే బీచ్ సమీపంలోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటుచేస్తున్న ప్రధాన వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ప్రముఖులు వీక్షించేందుకు అనువుగా వేదిక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. వేదికపై ప్రముఖులకు సీటింగ్ ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. వేదిక పరిసర ప్రాంతాలు మొత్తం లైటింగ్ ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 4వ తేదీ సాయంత్రం 4.25 గంటలకు భారత రాష్ట్రపతి ప్రధాన వేదిక వద్దకు చేరుకొని నావికా విన్యాసాలను వీక్షిస్తారని వెల్లడించారు. 2వ తేదీన పూర్తి స్థాయిలో డెమో రిహార్సల్స్ జరుగుతాయని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న
కలెక్టర్ మల్లికార్జున తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న కెకె.రాజు, తదితరులు

ప్రజాశక్తి- సీతమ్మధార : వార్డు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 45వ వార్డు నరసింహనగర్‌లో రూ.6.50లక్షలతో పార్కు అభివృద్ధి, రామచంద్రనగర్ వద్ద రూ.25లక్షలతో రామచంద్రనగర్, తారకరామ నగర్, ప్రసాద్ నగర్, గణేష్ నగర్‌లో సిసి రోడ్లు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేయించి, పనులు చేపడుతున్నట్లు రాజు వెల్లడించారు.ఎఇ అర్జున, వార్డు వైసిపి అధ్యక్షులు పైడి రమణ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలన

45వ వార్డు ఎస్ఆర్‌నగర్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను స్థానిక కార్పొరేటర్ కంపా హనోక్‌తో కలిసి కెకె.రాజు పరిశీలించారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే అతి త్వరలో లబ్ధిదారులకు కేటాయిస్తామన్నారు.

25వ వార్డులో...

25వ వార్డు సీతంపేట, శాంతిపురంలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతుల మేరకు రూ.25లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఎఇ. శ్రీరామ మూర్తి, సానబోయిన సురేష్, బోగవల్లి గోవింద పాల్గొన్నారు.

గంటాకు జన్మదిన శుభాకాంక్షలు



గంటాకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న నవీన్ జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి-ఆనందపురం :మాజీ మంత్రి, టిడిపి ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వేములవలస ఉప సర్పంచ్ టిడిపి యువనేత కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్రావు ఒకరోజు ముందుగానే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గంటా తమలాంటి వారెందరికో మార్గదర్శకుడని, ఆయన ఎక్కడి నుంచి పోటీ చేసినా విజయం సాధించే సత్తా ఉందన్నారు.

పార్కుల అభివృద్ధికి అధిక నిధులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. బుధవారం 87వ వార్డు తిరుమల నగర్‌లో పలు పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నియోజవర్గ పరిధిలోని అన్ని పార్కుల అభివృద్ధి చేస్తామన్నారు.వీధిదీపాల సమస్యను త్వరలో పరిష్కరిస్తా మన్నారు వైసిపి నేతలు కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద, దామోదర్, దానప్పలు, రమణ, శ్రీను పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి - ఆరిలోవ : శివ బాలయోగి మహరాజ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదర్శనగర్ శివాలయంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు.రెండు వేల మంది పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంలో స్వామి పరానందభారతి, కె.వెంకటేశ్వర్రావు, కె.మాధవి, వైస్ చైర్మన్ ఎం.వి.రావు, రమేష్ శర్మ పర్యవేక్షించారు.

వివాద రహిత భూహక్కు కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భావితరాలకు వివాద రహితంగా భూమి హక్కు పత్రాలను అందించాలన్నదే శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ఉద్దేశ్యమని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. నాలుగోవార్డు, నిడిగట్టు సచివాలయం పరిధిలోని ఆర్‌వై.అగ్రహారం, నిడిగట్టు గ్రామాల్లో సమగ్ర భూసర్వే అనంతరం 334 మంది భూయజమానులకు తొలి విడతగా భూహక్కు పత్రాలు అందజేశారు. ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జోనల్ కమిషనర్ ఎస్ వెంకటరమణ, తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంఆర్ఐ మృదుల, విఆర్ఒలు పోతిన వెంకట అప్పారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని కణమాంలో సమగ్ర భూసర్వే పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి రైతులకు అందజేశారు గ్రామంలో 987.091 ఎకరాలకు గాను, 621.60 ఎకరాలు సర్వే చేసి, 418మంది భూహక్కులను నిర్ధారించి మొదటి విడతగా 150 మందికి పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె యస్.విశ్వనాథన్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, ఎంపిపి డాక్టర్ శారద ప్రియాంక, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ఎంపిటిసి



భీమిలిలో భూహక్కు పత్రాలను అందజేస్తున్న ముత్తంశెట్టి

గొలగాని కృష్ణ, వైస్ ఎంపిపీ పొం్డంకి.శ్రీను, సర్పంచ్ అబోతు అప్పల రాము, తహశీల్దార్ లోకవరపు. రామారావు, ఎంపిడిఒ లరాజు, డిటి రాజేష్, మండల సర్వేర్ బాలకష్ణ, ఆర్ఐ సాయి, కొక్కరపూడి శ్రీకాంత్, సింహాచలంనాయుడు, అప్పలనాయుడు గండేటి శ్రీనివాసరావు, బాలిరెడ్డి మహేష్ , గీతల జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించారు.

పద్మనాభం : మండలంలోని బుడ్డివలస గ్రామంలో సమగ్ర భూసర్వే ఎల్‌పిఎం పాస్‌పుస్తకాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసవు పంపిణీ చేశారు. బుడ్డివలస, బుడ్డివలస అగ్రహారం, చిన్నాపురం, తిమ్మాపురం గ్రామాల్లో 508 మందికి భూమిహక్కు పత్రాలను

మూడు రాజధానులపై పార్టీల గందరగోళం

ప్రజాశక్తి-సీతమ్మధార : మూడు రాజధానుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అన్ని రాజకీయ పార్టీలు వక్రీకరించి, తమకు అనుకూలంగా మలుచుకుని ప్రజలను గందరగోళ పరుస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్రఅధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఎద్దేవా చేశారు. రామా టాకీస్ దరి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, రాజధానుల పేరుతో కాలయాపన చేస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటోందన్నారు. అమరావతి రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా మూడు ప్రాంతాల అభివృద్ధి కి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బోధనేతర బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను మినహాయించ డాన్ని స్వాగతిస్తూ, యాప్‌ల భారాన్ని కూడా తగ్గించాలని కోరారు. గురజాడకు నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు ఎమ్ఎస్ఎన్. మూర్తి, ఐ. ఆనంతలక్ష్మి, వడ్డె హరిగణేష్, బి.రాజశ్రీ, గొట్టాపు సుధీర్, శిరపు శ్రీనివాస్, వేణేశ్వరి పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో 'వివి'విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఉక్కునగరం : విజయవాడ స్టెల్లా కాలేజీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 8వ అంతర జిల్లాల నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ విమల విద్యాలయం(వివి)కి చెందిన ఎనిమిది మంది బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లా జట్టును రాష్ట్రస్థాయిలో తతీయ స్థానంలో నిలపడంలో కీలకపాత్ర పోషించారు. నవంబర్ 25 ,26,27 తేదీలలో విజయవాడలో నిర్వహించిన పోటీల్లో 12 జిల్లాల జట్లు పాల్గొనగా, విశాఖ జట్టుకు మూడో స్థానం



తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు

దక్కడంపై పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ లాన్సీ, తదితరులు విద్యార్థులను అభినందించారు.

6,7 తేదీల్లో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక డైట్‌లో కళా ఉత్సవ్ జిల్లాస్థాయి పోటీలు ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపల్ యు మాణిక్యం నాయుడు బుధ వారం ప్రకటనలో తెలిపారు. శాస్త్రీయ జానపద సంగీతం, డ్రమ్ము, తబలా, కంజీర, కాంగో, వీణ, వయొలిన్, సితార, సంతూర్ తదితర వాయిద్య పరికరాలు వాయించుట, భరత నాట్యం, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలు ఇలా 10 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల 9,10, 11,12 తరగతులు చదువుతున్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని బాలబాలికలు ఈ పోటీలకు అర్హులని, ఈ నెల 5లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు జి రవి మొబైల్ నంబర్లుకు 9052423757,9573573065 సంప్రదించాలని సూచించారు.

మాస్టర్ ప్లాన్ అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార: మధురవాడ జోన్ 4, 5, 6,7 వార్డుల సంబంధించిన మాస్టర్ ప్లాన్ అమలుపై స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తన నివాసంలో అధికారులతో సమీక్షించారు. కొన్ని ప్రాంతాల్లో టిడిఆర్ చెల్లించక రోడ్ల అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని త్వరలో పూర్తిచేయాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ సిసిపి సురేష్‌బాబు, వుడా ఎస్‌సి భవానీశంకర్ జోన్ అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 2021-22 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పాసైన విద్యార్థులకు బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిఇఒ ఎల్ చంద్రకళ సర్టిఫికెట్లు అందజేశారు. డ్రాపౌట్స్‌ను ప్రోత్సాహించి, ఓపెన్ స్కూల్ ద్వారా చదివిస్తున్న దివీస్ సంస్థను అభినందించారు. హెచ్ఎం శివరాణి, దివీస్ ప్రతినిధులు మహేంద్ర,పైడినాయుడు పాల్గొన్నారు.

గీతంలో విదేశీ విద్యార్థుల 'గ్రాడ్యుయేషన్ డే'

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ద్వారా నాలుగేళ్ల నర్సింగ్ విద్యను పూర్తి చేసుకుని స్వదేశాలకు వెళుతున్న విదేశీ విద్యార్థులకు బుధవారం ప్రత్యేకంగా పట్టభద్రుల దినోత్సవాన్ని నిర్వహించారు. గీతం అకడమిక్ ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య రంగంలో నర్సింగ్ వత్తికి ప్రత్యేక స్థానం ఉందని, విద్యార్థులు సేవాదక్పథంతో పనిచేయాలని సూచించారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ మాట్లాడుతూ వైద్యులతో పాటు నర్సింగ్ వత్తి నిపుణులకు డిమాండ్ పెరుగుతోందన్నారు. గీతంలో సదుపాయాలపై చదువు పూర్తి చేసుకున్న విదేశీ విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ,అంతర్జాతీయ విద్యార్థి వ్యవహరాల విభాగం డైరక్టర్ డాక్టర్ కెపిసి.కిషన్ పాల్గొన్నారు.

పంచకర్లకు అభినందన



పంచకర్లకు అభినందిస్తున్న 12వ వార్డు వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో వార్డు వైసిపి నాయకులు బుధవారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించారు. వార్డు అధ్యక్షులు కన్నేటి సుబ్బారెడ్డి, సేవాదళ్ ప్రధాన కార్యదర్శి సత్తి మందారెడ్డి, సుజాత, అర్జున్ ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

ముత్తంశెట్టిని కలిసిన పంచకర్ల

ప్రజాశక్తి-సీతమ్మధార : మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సీతమ్మధారలోని ఆయన నివాసంలో విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈసందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ, జిల్లాలో పార్టీ అభివృద్ధికి అందరి సమన్వయం, సహకారంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

ఘనంగా జగదీష్ చంద్రబోస్ జయంతి

ప్రజాశక్తి -భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ డైట్‌లో ప్రముఖ భారతీయ వృక్ష శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ముందుగా చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు మాట్లాడుతూ, రేడియో, మైక్రో వేవ్ ఆప్టిక్స్‌తో వక్ష శాస్త్రంలో గణనీయమైన ఫలితాలను శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ సాధించారని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు నాగేశ్వరరావు, త్రినాధరావు, హరిణి, మహ లక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్వాడీల్లో గ్రోత్ డ్రైవ్

ప్రజాశక్తి -మధురవాడ : అంగన్వాడీ కేంద్రాల్లో డిసెంబర్ ఒకటో తేదీ నుంచి గ్రోత్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనుంటున్నట్లు ఐసిడియస్ సూపర్‌వైజర్ సరిత అన్నారు. పిలకవానిపాలెం అంగన్వాడీ కేంద్రంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఐదేళ్లలోపు పిల్లలకు బరువు, ఎత్తులపై నిరంతర పర్యవేక్షణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాల సేవలు, చైల్డ్‌లైన్ 1098, పోలీస్ 100, ఇతర అత్యవసర ఫోన్ నెంబర్లు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు.

అనంతుని హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-పద్మనాభం: మండల కేంద్రంలోనిఅనంత పద్మనాభస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఏడాదిపాటు భక్తులుహుండీలో వేసిన కానుకలను ఇఒ కీర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లెక్కించగా, రూ.4,74,571 వచ్చినట్లు తెలిపారు. కుంతీమాధవస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. 3,60,571నగదు వచ్చిందని, .టిక్కెట్లు ద్వారా 77,440, .దాతల విరాళాల ద్వారా మరో రూ.36,736 ఆదాయం వచ్చినట్లు ఇఒ తెలిపారు.

జ్యూట్ కార్మికుల బకాయి చెల్లించండి

ప్రజాశక్తి - తగరపువలస : జ్యూట్ కార్మికుల బకాయి చెల్లింపులో యాజమాన్య ం జాప్యం చేయడం తగదని ఐఎన్‌టియుసి, చిట్టివలస లేబర్ యూనియన్, కాంగ్రెస్ కార్మిక సంఘం, టిఎన్‌టియుసి నేతలు విమర్శించారు. బుధవారం చిట్టివలస జ్యూట్ మిల్లు ఆవరణలో బాధిత జ్యూట్ కార్మికులతో ఆయా కార్మిక సంఘాలు సమావేశం నిర్వహించాయి.

స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవ తీసుకుని, యాజమాన్యంతో చర్చించి జ్యూట్ కార్మికుల బకాయి చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సిహెచ్ రమణ, జీరు వెంకటరెడ్డి, కొండపు ఈశ్వరరావు, సిహెచ్ అప్పలసూరి, జెవి కైలాష్ రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, ఎస్ అచ్చారావు, ఎంవి.గురుమూర్తి పాల్గొన్నారు. అనంతరం విశాఖ కార్మిక శాఖ కార్యాలయంలో బకాయిల చెల్లింపుపై జెసిఎల్‌తో భేటీ అయ్యారు. బకాయిల చెల్లింపుపై చర్చించారు.

స్థానికత చుట్టూ భీమిలి రాజకీయాలు!

- అప్పుడే ఊపందుకున్న రాజకీయ సమీకరణలు
- పట్టు నిలుపుకునే పనిలో అధికార వైసిపి
- పూర్వ వైభవం కోసం టిడిపి ఆరాటం
- ఎలాగైనా పాగా వేయాలని జనసేన యత్నం
- వ్యూహ, ప్రతివ్యూహాల్లో ప్రధాన పార్టీలు

ప్రజాశక్తి - విశాఖపట్నం : 2024లో భీమిలి రాజకీయ ముఖచిత్రం మారనుందా? అవుననే అంటున్నారు కొందరు తలపండిన రాజకీయ విశ్లేషకులు. ఈ నియోజకవర్గంలో అన్నిపార్టీలకు క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ ఉండడం, ఒక్కోసారి ఒక్కో పార్టీ విజయం సాధించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే రానున్న ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపై బలమైన చర్చలు, వాదనలు జరుగుతున్నాయనే చెప్పాలి .ప్రస్తుతానికి స్థానికత డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

అతి పెద్ద నియోజక వర్గం భీమిలి...

తాజాగా వెలువడిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలిస్తే గనుక విభజిత విశాఖ జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం భీమిలినే. ఓటర్లతో పాటు విస్తీర్ణం కూడా ఎక్కువే. ప్రధాన సమస్యలు కూడా అంతే స్థాయిలో ఉన్నాయి. ఇటీవల నవంబర్ 9న విడుదలైన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం 3,18,624 మంది ఓటర్లుండగా, పురుషులు 1,57,826 మహిళలు 1,60,777 మంది ఉన్నారు.

అపుడే ఊపందుకున్న రాజకీయ సమీకరణలు

నిర్దేశిత గడువు 2024కంటే ముందుగానే ఏడాది ముందు 2023లోనే సాధారణ ఎన్నికలు జరుగుతాయని ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో అపుడు రాజకీయ సమీకరణల జోరు ప్రధాన పార్టీల్లో ఊపందుకుందనే చెప్పాలి.

స్థానికత చుట్టూ 2024 ఎన్నికలు?

2024 ఎన్నికల్లో రాజకీయ సమీకరణలన్నీ స్థానికత చుట్టూ కచ్చితంగా తిరగనున్నాయనే రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పక్కనే ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి,అల్లూరి, జిల్లాల్లోని దాదాపు అన్ని నియోజక వర్గాల్లో స్థానికులే అక్కడ ఎమ్మెల్యేలుగా విజయం సాధిస్తున్న నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంలోనూ అలాగే జరగాలని స్థానిక యువత భావిస్తోందని,ఇప్పటికే వైసిపి కేడర్ ఈ విషయాన్ని సిఎం జగన్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ 2024 ఎన్నికల్లో స్థానిక యువతకే అవకాశం కల్పించాలని పార్టీ అధినేత జగన్ వద్ద ప్రస్తావించినట్లు భోగట్టా. అందుకు తగ్గట్టుగానే తాజా రాజకీయ పరిణామాలు క్రమంగా మారుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. పైపైకి 'అభ్యర్థి ఎవరనేది అప్రస్తుతం, జగన్ అదేశాలే శిరోధార్యం' అని మెజారిటీ కార్యకర్తలు అంటున్నప్పటికీ, లోలోపల స్థానికత అంశం బలంగా పనిచేయనుందని తెలుస్తోంది.

పట్టు నిలుపుకునే పనిలో అధికార వైసిపి

రాష్ట్రమంతటా ఫ్యాన్ సుడిగాలి వేవ్‌లోనూ భీమిలి నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో చావు తప్పి కన్ను లొట్టపోయిన చందాన ఇక్కడ గెలుపొందిన వైసిపి, మరలా సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలన్న ఆరాటంలో ఉంది. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలే పార్టీ



విజయావకాశాలను ప్రభావితవం చేస్తాయని భావిస్తున్నారు. పోటీలో ఉన్న వ్యక్తులు కంటే, 2019 మాదిరిగానే, సిఎం జగన్ ఛరిష్మా, అమలు చేసిన పథకాలతోనే 2024 ఎన్నికలకు వెళ్లేందుకు అధికారపార్టీ ఎన్నికలకు సిద్ధం కానుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు .

పూర్వ వైభవం కోసం టిడిపి

భీమిలి నియోజకవర్గంలో ఎవరు ఔనన్నా, కాదన్నా బలమైన కేడర్ ఉన్న టిడిపి మరోమారు ఇక్కడ గెలుపొందడం ద్వారా పూర్వవైభవం కోసం పాకులాడుతుందనే చెప్పాలి. ఇక్కడున్న ఎన్‌టిఆర్, బాలకృష్ణ అభిమానులు టిడిపికి రాజకీయంగా అదనపు బలమని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. 019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సబ్బం హరికి 91,598 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 1,00,540 ఓట్లు పడడంతో కేవలం 8,942 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. దీన్ని బట్టి టిడిపికి భీమిలిలో ఎంత పట్టుందో వేరే చెప్పనక్కరలేదు. ఈ పరిస్థితుల్లో ప్రధాన ప్రతిపక్షం టిడిపిలోనూ స్థానికత అంశానే అధినేత చంద్రబాబు వద్ద బలంగా వినిపించాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అనుయాయులు యోచిస్తున్నట్లు సమాచారం.

పాగా వేసేందుకు జనసేన ఆరాటం

అధికార వైసిపి, ప్రధాన విపక్షం టిడిపిలాగానే జనసేన పార్టీకూడా ఇక్కడ పాగా వేసేందుకు ఆరాటపడుతోంది. ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అప్పట్లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ తరపున ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయాన్ని ఇక్కడ గమనంలో పెట్టుకోవాలి. 2019ఎన్నికల్లో జనసేన అభ్యర్థి పంచకర్ల సందీప్‌కు ఊహించినదాని కంటే ఎక్కువగానే 24,114ఓట్లు రావడంతో దాన్ని పునాదిగా చేసుకుని రానున్న ఎన్నికలకు వెళ్లాలని జనసేన భావిస్తోంది. మునుపటి ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీని ఆదరించిన మెగా అభిమానులతోపాటు, పవన్‌కల్యాణ్ ఛరిస్మా రానున్న ఎన్నికల్లో బాగా లాభిస్తుందని, భీమిలిలో జనసేన విజయం సాధిస్తుందని జనసైనికులు ఆశాభావంతో ఉన్నారు. ఇక్కడ కూడా వైసిపి, టిడిపిలాగానే స్థానికత అంశాన్ని ప్రధానంగా ముందుకు తీసుకొచ్చి ఎన్నికల బరిలోకి వెళ్లాలని భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఎవరికి వారే ధీమా

భీమిలి నియోజకవర్గంలో అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపితోపాటు జనసేన పార్టీకి కూడా మంచి కేడర్ ఉండడంతో రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలు గెలుపుపైనే ధీమాతో ఉన్నట్లు కనిపిస్తోంది. ఎన్నికలకు మరో ఏడాదిపైగానే సమయం ఉండడంతో పొత్తులు, రాజకీయ సమీకరణలు గెలుపోటములు ప్రభావితం చేయనున్నప్పటికీ, ప్రస్తుతానికి మూడు పార్టీల్లోనూ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి స్థానికత అంశం ప్రధానంగా చర్చలో ఉండడం విశేషం.

నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి

సిఐటియు ఐదో మహాసభలో తీర్మానం



అగనంపూడి సిఐటియు మహాసభలో యూనియన్ నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని స్టీల్ సిఐటియు ఐదో మహాసభ తీర్మానించింది. బుధవారం అగనంపూడి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో నిర్వహించిన మహాసభలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వైటి.దాసు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.గత అక్టోబర్‌లో ఎన్‌ఎసిఎస్ సమావేశంలో క్లాజ్- 8 కారణంగా నూతన వేతనాలు అమలు కాకుండా అప్పట్లో అడ్డుపడిన ప్రస్తుత గుర్తింపు యూనియన్ ఇప్పటికైనా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి వేతన ఒప్పందం చేయాలన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేకుంటే అన్ని పక్షాలతో కలిసి పోరాటం ఉధృతం చేయాలని మహాసభలో పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ కోసం అవసరమైతే 25మంది ఎంపీలు రాజీనామా చేసి ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నీలకంఠం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరిస్తే, ఇప్పటికె అన్యాయమైపోయిన నిర్వాసితులకు ఎప్పటికీ న్యాయం జరగదన్నారు.యు మరిడయ్య అధ్యక్షతన జరిగిన మహాసభలో సెక్రటరీ సిహెచ్.అబ్బాయి, ఎర్రయ్య, అట్ట రామకృష్ణ, శశిరెడ్డి, పట్టా రమేష్, అప్పలరాజు, కోటి పాల్గొన్నారు. 40 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.


విద్యార్థుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కృషి



జగనన్న విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కషి చేస్తున్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. బుధవారం జగనన్న విద్యాదీవెన కింద గాజువాక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రూ.6 .92కోట్ల చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహాచలం, కళాశాల ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

బిసిడిఇ శిక్షణకు సెయింట్ ఆన్స్ ప్రతినిధులు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న భాగ్యలక్ష్మి, అనసూయాదేవి

ప్రజాశక్తి -ములగాడ : . గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 28, 29 తేదీలలో నిర్వహించిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బిసిడిఇ.) మాస్టర్ ట్రైనర్స్, ప్రాజెక్టు అధ్యాపకుల రెండు రోజుల శిక్షణలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారులు ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి పాల్గొన్నారు. వీరిని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిత్తశుద్ధితో అమల్లో పెట్టి, విద్యార్థులను సామాజిక సైనికులుగా తీర్చిదిద్దాలని కోరారు.

చట్టసభల్లో ఉప కులాలవారీ రిజర్వేషన్లతోనే బిసిల అభివృద్ధి



కృష్ణవేణికి నియామకపత్రం ఇస్తున్న సంఘం నేతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : బిసిలు అభివద్ధి చెందాలంటే చట్టసభలో రిజర్వేషన్లు చేయడం ఒక్కటే ప్రధాన ఎబిసిడి వర్గీకరణలోని ఉపకులాల వారీగా బిసిల్లోని వేర్వేరు కులాలకు చట్టసభలు, ప్రజాప్రాతినిధ్య పదవుల్లోనూ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని, తద్వారా బిసిల్లోని అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని, .జాతీయ బిసి ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుపిల్లి నూకరాజు, జిల్లా అధ్యక్షులు మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పౌరగ్రంథాలయంలో సంఘం సౌత్ ఇండియా మహిళా కన్వీనర్‌గా నియమితులైన రావెళ్ల కృష్ణవేణికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, బిసి కులాల వారీగా రాజకీయ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం నియమించిన జస్టిస్ రోహిణి కమిషన్ నివేదిక సమర్పించినా అమలులో తాత్సారం చేస్తోందన్నారు. కులాల వారీగా జనగనణ చేపట్టి, అన్ని బిసి కులాలకు న్యాయం చేయాలని కోరారు. తరువాత జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం విశాఖపట్నంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తమ్ముడి రాంబాబు చెల్లిబోయిన నాగేశ్వరరావు, సరగడం వెంకటలక్ష్మి, ఊర్వశి మహాలక్ష్మి రమణమ్మ వెంకట్రావు పాల్గొన్నారు

కార్మికుల ప్రయోజనాలకు గండికొడితే ఊరుకోం



సిఐటియు ఆధ్వర్యాన మెయిన్‌గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక: భెల్ కార్మికుల ప్రయోజనాలకు గండికొడితే ఆందోళన చేస్తామని, బెల్ విశాఖ యూనిట్లో ఉన్న కార్మికులకు రావలసిన అన్ని సదుపాయాలు తక్షణమే కల్పించాలని, భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఢిల్లీలో జాతీయ కార్మికసంఘాల నేతలతో భెల్ యాజమాన్యం నిర్వహించిన సంయుక్త సమావేశంలో కార్మికుల ప్రతికూల నిర్ణయాలు తీసుకోవడాన్ని నిరసిస్తూ భెల్ మెయిన్ గేట్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. కరోనా పేరుతో మూడేళ్ల బోనస్‌ను యాజమాన్యం ఎగ్గొట్టిందని మండిపడ్డారు. కార్మికులకు న్యాయం చేయకుంటే అన్ని యూనియన్లను సమీకరించి ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.జగన్నాథరావు, సిహెచ్ నారాయణ, చిన్నబాబు, హెచ్ భోగేష్, ఆర్ జనార్థనరావు, అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొన్నారు.

సంక్షేమం మాటున దోపిడీ

తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు అనిత



తునివలసల 'టిడిపి మాటా మంతి'లో మాట్లాడుతున్న అనిత

ప్రజాశక్తి-పద్మనాభం : పాదయాత్రలో ముద్దు ముచ్చట్లతో ఎన్నో హామీలిచ్చిన సిఎం జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత అందరినీ నిండా ముంచేసి మోసం చేస్తున్నారని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మండిపడ్డారు. బుధవారం మండలంలోని తునివలసలో టిడిపి మాటా మంతిలో భాగంగా గ్రామమహిళలతో మమేకమయ్యారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. సంక్షేమపేరుతో ఒక్కో కుటుంబం నుంచి రూ.రెండు లక్షల మేర వైసిపి ప్రభుత్వం దోపిడి చేస్తోందన్నారు. మాట తప్పి, మడం తిప్పి, ఆరాచక పాలనతో, అన్నీ పెంచుకుపోతూ రాష్ట్రాన్ని నిండా ముంచేశారని ఆరోపించారు. ప్రజలంతా అవగాహనతో వైసిపిని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అద్యక్షుడు కోరాడ రమణ, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు కురిమిన లీలావతి, అనంతలక్ష్మి, మహిళా సంఘాల ప్రతినిధులు, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజుబాబు, మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు పాల్గొన్నారు.

జెట్టీ నిర్మాణం సాధ్యం కాదు

★ నేవీ గేట్ ద్వారా వేటకు వెళ్లడానికి నిరాకరణ
★ ఒఎన్‌జిసి ప్యాకేజీ అందిస్తాం
★ అర్థం చేసుకొని ఆందోళన విరమించండి
★ ఎన్ఎఓబి నిర్వాసిత చర్చల్లో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి - రాంబిల్లి

నేవల్ బేస్ నిర్వాసిత మత్స్యకారుల చేపల వేట నిమిత్తం జెట్టీ నిర్మాణం ఇప్పట్లో సాధ్యం కాదని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి స్పష్టం చేశారు. 31 రోజులుగా నావ్ నిర్వాసితులు నేవీ మెయిన్ గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నేపథ్యంలో అమరావతి వచ్చిన సీనియర్ ఐఎఎస్ అధికారుల సమక్షంలో బుధవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో ఎనిమిది గ్రామాల నిర్వాసిత పెద్దలతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్తపట్నం వాడ నరసాపురం మత్స్యకారులకు నేవీ గేటు నుండి వెళ్లడానికి నేవీ అధికారులు నిరాకరించారని, వారికి ఒఎన్‌జిసి ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. గ్రామాలు తరలించే వరకు వాడ నరసాపురం గ్రామం వద్ద బీచ్‌లో బోట్లు పెట్టుకునేందుకు చదును చేస్తామని చెప్పారు. అర్హులైన వారికి నిర్మాణ కంపెనీలు, ఎస్ఇజెడ్ కంపెనీలతో మాట్లాడి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని, బ్రిడ్జింగ్ ప్యాకేజీ 587 మందికి ఇస్తామని వెల్లడించారు. నేవీ పునరావాస కాలనీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, గంపల ప్యాకేజీ అందిస్తామని, ఎస్ఇజెడ్ నిర్వాసితుల వలే ఐదు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని తెలిపారు. నేవీ ప్రభావిత గ్రామాలైన చిన్న కలవలపల్లి, కొత్తపేట, గోవిందపాలెం, వాడపాలెం గ్రామాలను సర్వే చేస్తామని, మిగిలిన సమస్యలు రెండో విడతలో పరిష్కరిస్తామని, అర్థం చేసుకొని ధర్నాను విరమించాలని నిర్వాసిత నాయకులను కోరారు. దీనిపై నిర్వాసిత నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మాటలు మీరే టెంట్ వద్దకు వచ్చి నిర్వాసితులతో చెప్పండి అని స్పష్టం చేసి వచ్చేశారు.

నిర్వాసితులను బూతులు తిట్టిన ఎమ్మెల్యే

చర్చల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి బయటకొస్తున్న నిర్వాసిత నాయకులను ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు ఆగి మాట్లాడమన్నారు. గతంలో నిర్వాసితులకు మీరిచ్చిన హామీలు ఏమిటి? ఇప్పుడు ఇక్కడ జరుగుతుందని ఏమిటని నిర్వాసిత నాయకులు ప్రశ్నించారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే 'నేను చెప్పింది అర్థం కాదా?' అంటూ బూతులు తిట్టారు. అక్కడ మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారన్న సంగతి మర్చిపోయి చెప్పడానికి వీలులేని బూతులు తిట్టారు. దీంతో నిర్వాసిత నాయకులు ఏమీ అనలేక అక్కడ నుండి వెళ్లిపోయారు.

31వ రోజు కొనసాగిన ఆందోళన

నేవీ నిర్వాసితులు నేవీ మెయిన్ గేట్ ముందు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 31వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎనిమిది గ్రామాల ప్రజలు రోడ్డుపై బైఠాయించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి : ప్రభుత్వం నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 31 రోజులుగా ఎనిమిది గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పరిష్కరించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా కలెక్టర్, అధికారులు మూడు దఫాలుగా తూతూ మంత్రంగా చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మత్స్యకారులకు జెట్టీ నిర్మిస్తామని గతంలో ఒప్పందంలో చెప్పి నేడు అందుకు అవకాశం లేదని చెప్పడం మత్స్యకారులను మోసగించడమే అవుతుందన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కనీసం నిర్మాణ పనుల్లో కూడా ఉపాధి కల్పించకపోవడం శోచనీయమన్నారు. మిగులు వ్యవసాయ భూములకు రోడ్డు వేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడం భావ్యమా? అని ప్రశ్నించారు. నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకుడు జి.దేవుడు నాయుడు, ఏపీ మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి చొడిపల్లి గంగరాజు పాల్గొన్నారు.



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శాంతి, ఇ.పార్వతి

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 6వ జిల్లా మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.శాంతి, ఇ.పార్వతి, కోశాధికారిగా ఎం.సూర్యకళ, ఉపాధ్యక్షులుగా వి.సత్యవతి, కె.లక్ష్మి, కార్యదర్శులుగా కె.వరలక్ష్మి, బి.రామలక్ష్మి, కమిటీ సభ్యులుగా కర్రి తార, కొప్పాక ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, చిట్టమ్మ, రాజ్యలక్ష్మి, మంగవేణి, సరోజిని, నాగమణి, కాగిత లక్ష్మి ఎన్నికయ్యారు.

గ్రామాల్లోనే మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-కశింకోట : గ్రామీణ ప్రజలకు వ్యక్తిగత శ్రద్ధతో సొంత ఊరిలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నామని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి యశోద అన్నారు. బుధవారం మండల కేంద్రం కశింకోటలో సచివాలయం-3లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు, మందులను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలోని హెచ్ఒబి ఎ.దుర్గా హెల్త్ విజిటర్ విజయలక్ష్మి, ఎఎన్ఎం నిర్మల, వైద్య సిబ్బంది ఇవాంజెలిన్, సుబానీ, కనక, కొండమ్మ, శ్రీదేవి, పార్వతి పాల్గొన్నారు.

ధరావత్తుదారుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి- కశింకోట : గ్రంథాలయంలో ధరవత్తుదారులను ఎక్కువ సంఖ్యలో చేర్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్వి.వెంకటరావు ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. రికార్డులు, హాజరు పట్టిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ పాఠకులు వచ్చేలా చూడాలన్నారు. నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి కాంగ్రెగులు జగన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మంత్రిపాలెం మహిళల కోలాటం

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ మండలం మంత్రిపాలెం గ్రామానికి చెందిన పచ్చిగోరి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మహిళల కోలాట బృందం తిరుపతిలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో కార్తీక బ్రహ్మోత్సవాలలో సందర్భంగా మంత్రిపాలెం శ్రీహరి కోలాట బృందం వారిచే కోలాటా ప్రదర్శన చేశారు.

సీతయ్యపేట జంక్షన్‌లో సిసి కెమెరాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట జంక్షన్‌లో బుచ్చయ్యపేట ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా మూడు సీసీ కెమెరాలు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- చోడవరం

నంద్యాలలో నవంబర్ 25 నుండి 28వ తేదీ వరకు జరిగిన 2వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి 18 బంగారు, 16 రజత, 12 కాంస్య పతకాలు సాధించారు. **బంగారు పతకాలు :** చోడవరంకు చెందిన బొబ్బిలి రామచంద్ర (2 బంగారు పతకాలు), ఎం.సంతోషి లక్ష్మి, వి.లికిత, కోల్లిపార తన్విత్, జి.కారున్యదీప్, అనకాపల్లికి చెందిన ఎం.పూజిత (2), డి.జహ్నవి (2), ఎం.మోహన్ (2), ఎం.పవిత్ర, ఎ.సహస్ర, బి.లోకేష్, కె.దీపశ్రీ, డి.కృష్ణవేణి, కె.చంటిబాబు. **రజత పతకాలు :** చోడవరంకు చెందిన ఎం.సంతోషి లక్ష్మి, వి.లికిత, ఎం.హేమశ్రీ, వి.ఇసిత శరద (కిడ్స్), విష్ణువర్దన్, జి.నాగ సాయిరామ్, పిఎస్-ఎస్.తరుణ్ (2), ఎస్.తనహా (2), కె.రోహిత్, వి.జసిక రోజిలి రజతం, అనకాపల్లికి చెందిన డిఎస్ఎస్.అంజని ప్రియ, బి.దినేష్, డిఎల్‌జి.మణిలర్, పెదపాటి హర్షవర్ధన్ సూర్య, కె.దివశ్రీ, ఆర్ లోకేష్ **కాంస్య పతకాలు :** చోడవరంకు చెందిన ఆర్.దిక్షిత, శశివర్ధన్, వి.సాయి దశ్వంత్, అనకాపల్లికి చెందిన బి.దినేష్, కె.కార్తీక, ఎస్‌కె.దహిద అంజుమ్, ఎ.చార్విక్, ఆర్.లోకేష్ పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను కోచ్‌లు దూలం రమేష్, సంతోషి లక్ష్మి, శేఖర్‌ను ఏపి తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు టి.హర్షవర్ధన్ ప్రసాద్ అభినందించినట్లు ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పల్లం మురళీకృష్ణ తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

అక్రమ అరెస్టులపై యుటిఎఫ్ నిరసన



నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విజయవాడ ధర్నా చౌక్ వద్ద సదస్సుకు హాజరైన యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలను, ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడంపై ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అచ్యుతాపురం మండలశాఖ ఆధ్వర్యాన బుధవారం విద్యా కేంద్రం ఆవరణలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సదస్సుకు పోలీసుల అధికారులు ముందు అనుమతులు మంజూరు చేసి, తరువాత వాటిని రద్దు చేసి ఉపాధ్యాయులను అరెస్టు నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేజాక రవికుమార్, సబ్బారపు నూకరాజు మాట్లాడుతూ ఉద్యోగులు నెల నెల తమ జీతం నుండి మినహాయించి ఎపిజిఎల్ఐ, జెడ్‌పిపిఎఫ్ తదితర ఖాతాల్లో నిల్వ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆ డబ్బుల నుండి వారి వ్యక్తిగత అవసరాల కోసం రుణం మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైన పెండింగ్‌లో ఉన్న ఎపిజిఎల్ఐ, జెడ్‌పిపిఎఫ్ రుణాలు, మెడికల్ బిల్లులు, కరువు భత్యం బకాయిలు, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ తదితర బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు కె.మురళీకృష్ణ, ఆర్ పైడిరాజు, ఎన్.శ్రీనివాస్ రాజు, కె.కరుణ కుమార్, పట్నాల రేఖ, చలమాన సత్యనారాయణ, కుమారి, ఝాన్సీరాణి, సూర్యలక్ష్మి, పివిఎస్ అప్పారావు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా క్వారీలు నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే క్వారీలు నిర్వహణ జరగాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ ఆదేశించారు. మండలంలోని మార్టూరు గ్రామంలో సర్వే నెంబర్-1లో రాక్ లైన్ మైనింగ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మూడు హెక్టార్లలో నిర్వహించనున్న రోడ్డు మెటల్ బిల్డింగు స్టోన్ క్వారీ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని, సిఎస్ఆర్ నిధులు గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాలని, అవుటర్ రింగ్ రోడ్డుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్లు చేశారు. వీటిని అమలు చేసేందుకు సంబంధిత క్వారీ యజమాని రామినేని సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్, గనుల శాఖ జియాలజిస్టు, తహశీల్దారు గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం

వనపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొందిన 14 మంది బాల బాలికలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు అచ్యుతాపురం మండల బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షులు గొంపా నరసింహనాయుడు తెలిపారు. ఎస్ఎఫ్ఎ ఆధ్వర్యంలో పరవాడ మండలం లేమర్తి అగ్రహారంలో బుధవారం విశాఖ జిల్లా బాల్ బాడ్మింటన్ బాల బాలికల అండర్-14, అండర్-17 విభాగాలకు జట్టు ఎంపిక జరిగినట్లు చెప్పారు. జిల్లా జట్టుకు ఎంపికైన వీరంతా జిల్లాలోని పలు పాఠశాలల్లో చదువుతున్నారు. ఎంపికైన క్రీడాకారులు మంచి క్రమశిక్షణతో రాణించి విశాఖ జిల్లాకు ప్రథమ స్థానం తీసుకురావాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.శేఖర్ కోరారు. వాడ చీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి.అన్నాజీరావు, రమేష్ నాయుడు, బి.అప్పలనాయుడు, క్లబ్ కార్యవర్గ సభ్యులు క్రీడాకారులను అభినందించారు.


చెక్కు అందజేస్తున్న బిసి, ఎస్‌సి సంక్షేమశాఖ అధికారులు

విద్య దీవెన కింద రూ.24.40 కోట్లు మంజూరు

ప్రజాశక్తి -అనకాపల్లి : జగనన్న విద్య దీవెన పథకం కింద అనకాపల్లి జిల్లాలోని 42,755 మంది విద్యార్థులకు రూ.24,40,67,821 మంజూరైనట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.రాజేశ్వరి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి టి.అజయ్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆ నిధులను బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన నాలుగవ త్రైమాసికంలో బిసి వెల్ఫేర్ పరిధిలో 38,526 మంది బిసి, ఈబీసీ, కాపు విద్యార్థులకు రూ.22,24,14,192, ఎస్‌సి వెల్ఫేర్ పరిధిలో 3,375 మంది విద్యార్థులకు రూ.1,74,23,517, ఎస్టీ వెల్ఫేర్ కింద 594 మంది విద్యార్థులకు రూ.26,09,250, మైనారిటీ వెల్ఫేర్ కింద 260 మంది విద్యార్థులకు రూ.16,20,862 విడుదలైనట్లు చెప్పారు.

నేడు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - దేవరాపల్లి : వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద 62.31 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వెల్లడించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నవంబర్ నెల పెన్షన్ మొత్తం డిసెంబర్ 1వ తేదీన నేరుగా లబ్ధిదారులు ఇంటికి వెళ్లి అందజేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు పెన్షన్ కోసం ప్రభుత్వం రూ.1584.87 కోట్లు ఇప్పటికే విడుదల చేసిందన్నారు.


డ్రోన్ సర్వే చేస్తున్న అధికారులు

చిన్నప్పన్నపాలెంలో డ్రోన్ సర్వే


ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని చిన్నప్పన్నపాలెంలో బుధవారం జగనన్న సంపూర్ణ భూహక్కు పథకంలో భాగంగా డ్రోన్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ డ్రోన్‌తో భూముల వివరాలను ఫోటోలు తీసి తద్వారా రైతుల భూములతో సరిపోల్చడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోవెల ఈశ్వరరావు, వీఆర్వో ఎర్రయ్య, మండల సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయం వద్ద పూజలు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని చింతలపాలెం గ్రామంలో మోదకొండమ్మ గుడి వద్ద బుధవారం అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం వద్ద భక్తులు ఏర్పాటు చేసిన సద్దిని మాల వేసిన అయ్యప్ప భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చింతలపాలెం సర్పంచ్ కొట్టె రాము, జె.తుని వైసిపి నాయకులు కోన నాగేశ్వరరావు, ఆనాల తాతయ్య నాయుడు, మజ్జి నాగేశ్వరరావు, బోని గణేష్ పాల్గొన్నారు.

సీతారాముల గర్భగుడి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో సీతారాముల ఆలయంలో గర్భగుడి నిర్మాణానికి బుధవారం ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయంలో ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలిజి మంగ, నాయకులు బలిజి ముసలి నాయుడు, వైసిపి నాయకులు గొంతిని శివబాబు, పందిరి కొండలరావు, గొంతిని శివ చెంచునాయుడు, కల్లెపల్లి శ్రీనివాసరావు, డొప్పా రామోజీ, డొప్పా ఈశ్వరరావు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న కలగా గున్నయ్యనాయుడు తదితరులు

కూలి రేట్లు పెంచాలని హమాలీల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న హమాలీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

బేవరేజెస్ డిపో హమాలీల కూలి రేట్లు పెంచాలని కోరుతూ బుధవారం శంకరం వద్ద గల ఏపీబీసీఎల్ఐఎంఎఫ్ఎల్ అండ్మ ఎఫ్ఎల్ డిపో వద్ద హమాలీలు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష కార్యదర్శులు కనక రమణ, కొండలరావు మాట్లాడుతూ ఎగుమతి కూలీరేటు ఏడు రూపాయల నుంచి పది రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. గతేడాది నవంబర్ నుంచి చెల్లించాల్సిన ఏరియర్స్‌ను డిసెంబర్ 10వ తేదీలోగా చెల్లించని పక్షంలో సమ్మె చేస్తామని హెచ్చరించారు. హమాలీ కూలి రేట్లు పెంచాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లవిల్లి నరసింగరావు, ఎల్లా అప్పారావు, జె.సూర్య నాయుడు, జి త్రినాథ్, తాడి రాజు, పి రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై వినతులు

ప్రజాశక్తి-సబ్బవరం : ఎంపిపి బోకం సూర్యకుమారి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలపై ఆయా శాఖల అధికారులకు వినతులు అందజేశారు. నారపాడు అంగన్వాడీ కేంద్రాన్ని ఖాళీగా ఉన్న స్కూల్ బిల్డింగ్‌లోకి మార్చాలని ఆ గ్రామ సర్పంచ్ మామిడి శంకర్రావు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీలు శరగడం ఝాన్సీ లక్ష్మి రాణి, చొక్కాకుల గోవింద, ఎంపీడీవో బి.రమేష్ నాయుడు, వైసిపి నాయకులు బోకం రాము నాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల సమావేశం

పరవాడ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పైలా వెంకట పద్మ లక్ష్మీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, నీటిపారుదల, గృహ నిర్మాణ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు.


మాట్లాడుతున్న పరవాడ ఎంపిపి వెంకటపద్మ లక్ష్మి

అనంతరం వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీల్లో కొత్తగా నియమితులైన వాలంటీర్లకు ఎంపిపి, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు , ఎంపీడీవో హేమ సుందరరావు, తహశీల్దారు వి.ప్రకాష్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

వైసిపి అరాచక పాలనపై పోరాటం


మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి-సబ్బవరం

వైసిపి ప్రభుత్వ అవినీతిని, అరాచక పాలనపై పోరాటానికి సిద్ధం కావాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. టిడిపి చేపడుతున్న 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమంగా పని చేసి జయప్రదం చేయాలన్నారు. మండలంలోని ఇరువాడ జివిస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన పెందుర్తి నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పల నాయుడు, నియోజకవర్గం నాయకులు పైలా జగన్నాధరావు, ఎం.నీలబాబు, రెడ్డి నారాయణరావు, మిడతాడ మహలక్ష్మి నాయుడు, పిలివిఎస్ఎన్ రాజు, భరణికాన సాయినాధరావు, రేసుపూడి రమణ, దొడ్డి సూర్యప్రకాష్, పల్లా తాతారావు, గండి దేముడు, బొండా సత్యారావు, కోటాన అప్పారావు, దెడ్డము ప్రసాదరావు, దాసరి వెంకట రమణ, అక్కిరెడ్డి దుర్గి నాయుడు, తమరాన బంగారు నాయుడు, గొర్లి కృష్ణ చైతన్య, బోకం సత్యనారాయణ, ఆడారి నాగరాజు, సీరం అప్పలరాజు, కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, ఆకుల గణేష్, బుదిరెడ్డ కనకరాజు, బొండా రాజు, వంగలపూడి సంతోష్ బాబు పాల్గొన్నారు.

అనకాపల్లి : జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో డిసెంబర్ 2 నుంచి ప్రారంభం కానున్న ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-చోడవరం : వైసిపి పాలనలో పేదల గడప వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని దుద్దుపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. మూడేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని పిండ్రంగి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు బుధవారం నిర్వహించారు. ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలపై స్వయంగా తనకు చెప్పాలని కోరారు. గ్రామానికి 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, ఎంపీడీవో కె.శచీదేవి, తహసీల్దార్ రమేష్ బాబు, సర్పంచులు జాగరపు రామలక్ష్మి, వేచలపు దొరబాబు, ఎంపీటీసీ లెక్కల గోపి పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీ పరిధి 22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఒక ఇంటి గోడను విద్యుత్ స్తంభంతో కలిపి నిర్మించడాన్ని గమనించి, ఆ స్తంభాన్ని వీలైనంత త్వరగా మార్చాలని ఎలక్ట్రికల్ ఏఈని ఆదేశించారు. అనంతరం ఉత్తరాంధ్ర స్థాయి సబ్ జూనియర్స్ (బాలికలు) హాకీ టోర్నమెంట్ విజేతగా నిలిచిన ఎలమంచిలి హాకీ జట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, ఎంపీపీ బొద్దేపు గోవింద్, వైసిపి నాయకులు బొద్దపు ఎర్రయ్య దొర, ఆరిపు గుప్త పాల్గొన్నారు.


కోతుల కోసం ఏర్పాటు చేసిన బోన్లు

కోతులు నివారణకు చర్యలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, ఎల్బీపీ అగ్రహారం, బంగారంమెట్ట, లోపూడి తదితర గ్రామాల్లో అధిక సంఖ్యలో ఉన్న కోతులను నివారించే చర్యలను బుధవారం అధికారులు ప్రారంభించారు. ముందుగా బంగారం మెట్ట, ఎల్బీపీ అగ్రహారం గ్రామాల సమీపంలో డాల్ఫిన్ డెయిరీ దగ్గర పామాయిల్ తోటలో మూడు బోన్‌లను ఏర్పాటు చేశారు. కోతులను మచ్చిక చేసుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిచోట బోన్లు ఏర్పాటు చేసి కోతులు పట్టుకోవడం జరుగుతుందని ఫారెస్ట్ రేంజర్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బిపి అగ్రహారం, లోపూడి సర్పంచ్‌లు తామరాన శ్రీనివాసరావు, మొరుగు కుమారి బాబురావు, కో-ఆపరేటివ్ అధ్యక్షులు సాయం రమేష్, రైతు సంఘం అధ్యక్షుడు తామరాన వెంకటరమణ పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులకు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి : వియంఆర్‌డిఎ చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన పేదలకు న్యాయం చేయాలని కోరుతూ రైతు కూలి సంఘం ఆధ్వర్యాన బుధవారం తహశీల్దారు, ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ భూ సమీకరణలో గిరిజన, దళిత రైతు కూలీల భూములు అధికంగా ఉన్నాయని, వారికి ప్రభుత్వ ఒప్పంద ప్రకారం వారికి రెసిడెన్షియల్ ప్లాట్లు ఇవ్వాలని, జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ 20 రోజుల్లో రెసిడెన్షియల్ ప్లాట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, మామిడిపాలెం, పాపయ్య సంతపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కశింకోట : లింగ వివక్షపై మండలంలోని తీడ గ్రామంలో కశింకోట మండల మహిళ సమాఖ్య అధ్యక్షులు కె.అరుణ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హింస, లైంగిక వేధింపులు, బాలికల అక్రమ రవాణాను అరికట్టాలని, లింగ వివక్షను నిర్మూలించాలని, ఇందు కోసం చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. మహిళలు రక్షణ అందరి బాధ్యత అని, పిల్లలకు నైతిక విలువలు విద్యను నేర్పిద్దాం, ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేద్దాం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు విఒఎలు భవాని, మణిరాజు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


అభివృద్ధి పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - దేవరాపల్లి : దేవరాపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు బుధవారం పర్యవేక్షించారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి రైవాడ రోడ్డు, ప్రభుత్వ కార్యాలయాల రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. గ్రామ శివారు కళ్లాల వైపుకు వెళ్లే లింక్ రోడ్డు పనులను కాలినడకన వెళ్లి నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. కొల్లివానిపాలెం, బందారు వారికళ్లాలు, కోరుకోలవారి కళ్లాలు, గుల్లిపల్లి వారి కళ్లాలు, రాయవరపు వారి కల్లాలు వద్ద సిసి రోడ్ల పనులను బైక్‌పై వెళ్లి పర్యవేక్షించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు జరగాలని, తేడా వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, డాక్టర్ వరదపరెడ్డి సింహాచలం నాయుడు, కెవి.రమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణం చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బూడి

స్ఫూర్తిదాయకంగా మత్స్యకారుల ఉద్యమం

◆నేటితో 365 రోజుకు ◆సింహ గర్జన పేరిట బహిరంగ సభ


ఆందోళన చేస్తున్న మత్స్యకారులు (ఫైల్)

ప్రజాశక్తి- నక్కపల్లి: హెటిరో పైపులైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారుల తలపెట్టిన ఉద్యమం స్ఫూర్తిదాయకంగా కొనసాగుతుంది. పైపులైన్కు వ్యతిరేకంగా మత్స్యకార జెఎసి అధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహాధర్నా ఈనెల 1వ తేదీతో 365 రోజులకు చేరుకున్నాయి. రాజయ్య పేట సమీపంలో హెటిరో డ్రగ్స్ కంపెనీని 2007 సంవత్సరంలో ఏర్పాటు చేసారు. కంపెనీ రసాయన వ్యర్ధ జలాలలను పైపులైన్ ద్వారా సముద్రంలోకి వదులుతున్నారు. కంపెనీ వ్యర్ధ జలాలు సముద్రంలోకి వదలడంతో ఈ ప్రాంతంలో మత్స్య సంపద సేశించిపోయిందని, ఉపాధి లేకుండా పోయిందని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. అదే విధంగా కంపెనీ నుండి వెలువడే కాలుష్యం కారణంగా అనేక రోగాల బారిన పడుతున్నామని మత్స్యకారుల ఆవేదన. కంపెనీ యాజమాన్యం 2021 నవంబర్ నెలలో 3 అడుగుల వైశాల్యంతో కొత్తగా మరో పైపులైన్ వేసారు. దీంతో మత్స్య కారులంతా, పైపులైన్కు వ్యతిరేకంగా పోరాటం. ప్రారంభించారు. ఇప్పటికే వేసిన పైపులైన్ వల్ల ఉపాధి కోల్పోవడం జరిగిందని, కొత్తగా పైపులైన్ వస్తే తమ ఉనికికే ప్రమాదమని మత్యకారులు ఆందోళన బాట పట్టారు. 2021 డిశంబర్ 1 నుంచి కొత్తగా వేస్తున్న పైపులైన్కు వ్యతిరేకంగా మత్యకారులు శాంతియుత మహా ధర్నా చేపట్టారు. దీంతో కంపెనీ యాజమాన్యం కొత్తగా వేస్తున్న పైపులైన్ పనులు నిలుపుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్తులో కూడా పైపులైన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని మత్స్యకారుల ప్రధాన డిమాండ్తో ఆందోళన కొనసాగిస్తున్నారు. 2021 డిశంబర్ 6న రాజయ్య పేట నుంచి నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకు పైపులైన్కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన పాదయాత్రకు అనుమతి లేదని పోలీసు నివారించారు. అనేక ఆటంకాలు ఎదురైనా మత్స్యకారులు పట్టువీడని విక్రమార్కులా ఆందోళన కొనసాగిస్తున్నారు. అంతే కాకుండా తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదన్న ఉద్దేశ్యంతో న్యాయ పోరాటం చేస్తున్నారు. చెన్నైలో జాతీయ హరిత ట్రిబ్యునల్ లో కేసు వేయడంతో వారు వివిధ విభాగాల్లో ముఖ్యమైన అధికారులతో అత్యున్నత కమిటిని నియమించారు. కమిటి 2022 మార్చి నెలలో ఈప్రాంతంతో పర్యటించి మత్స్యకారుల నుంచి వివరాలు సేకరించారు. అఖిల పక్ష పార్టీల నాయకులు కూడా మత్స్యకారులు తలపట్టిన పోరాటానికి మద్దత్తు ప్రకటించారు. సిపిఎం మరో అడుగు ముందుకు 'వేసి మత్స్యకారులు చేపట్టిన ఆందోళనలో పాల్గొని, మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ప్రకటించారు. మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహాధర్నా నేటికి 365 రోజులకు చేరుకోవడంతో మత్స్యకారుల సింహ గర్జన పేరిట గురువారం శిబిరం వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు మత్స్యకారులు ప్రకటించారు.


364 వ రోజుకు చేరిన మత్స్యకారుల ధర్నా

నక్కపల్లి: హెటిరో పైప్ లైన్ పూర్తిగా తొలగించాలని మత్స్యకార నాయకులు డిమాండ్ చేశారు. పైప్ లైన్కు వ్యతిరేకంగా మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా బుధవారం నాటికి 364 వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. మత్స్యకారుల జీవన విధానానికి నష్టం కలిగించే పైప్ లైన్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన ఆందోళన నేటితో 365వ రోజుకు చేరడంతో సింహ గర్జన పేరిట గురువారం శిబిరం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మత్స్యకార నాయకులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పిక్కి స్వామి, పిక్కి గంగరాజు, గోసల స్వామి, మైలపల్లి బాబ్జి, మైలపల్లి బైరాగిరాజు, శ్రీను, కారే కోదండ, మైలపల్లి జాను, చేపల సోమేశ్, మైలపల్లి శివ, వందలపు అప్పలరాజు, వాసపల్లి స్వామి, తదితరులు పాల్గొన్నారు.


ఆటలు ఆడుతున్న వికలాంగ విద్యార్థులు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఏఎల్పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చిత్రలేఖనం, పెయింటింగ్, సాంప్రదాయ నృత్యాలు, మ్యూజికల్ చైర్స్, కథలు చెప్పడం, పరుగు పందెం, స్కిట్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.భారతి, ప్రత్యేక విద్య పాఠశాల సహాయకులు టి.మాణిక్యం, వ్యాయామ, ఇతర సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వైసిపిలో చేరుతున్న టిడిపి కార్యకర్తలు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నాతవరం: మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన 15 కుటుంబాలకు చెందిన టిడిపి కార్యకర్తలు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ రాము ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. జగనన్న ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం జగన్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు పైల పోతురాజు, వైస్ ఎంపీపీ ఫైల్ సునీల్, జడ్పిటిసి కాపరపు అప్పలనారస, మండల వైయస్సార్ పార్టీ యువజన విభాగ అధ్యక్షులు బండారి నాయుడు, గన్నవరం పిఎస్ఈఎస్ అధ్యక్షులు గొర్లి వరహాలు బాబు, శివాజీ పాల్గొన్నారు.

యువకుడు అరెస్ట్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: రెండు రోజుల క్రితం స్థానిక బ్రాహ్మణ వీధిలో ఆకతాయుల అలజడితో స్థానికులు భయాందోళన చెంది పోలీసులకు సమాచార ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో గంజాయి పౌడర్ కలిగి ఉన్న యువకుడిని అరెస్టు చేసినట్లు నర్సీపట్నం సిఐ నమ్మి గణేష్ తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో రెండు రోజులు కిందట బ్రాహ్మణ వీధిలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్న యువకుల ప్రవర్తనపై స్థానికులు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు తాము వెళ్లి పరిశీలించగా 150 గ్రాముల గంజాయి ఫౌడర్ లభ్యమైందన్నారు. స్థానిక గచ్చపు వీధికి చెందిన మధు సాయికుమార్ను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించామన్నారు.

బిఎస్పి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: బిఎస్పీ బలోపేతంకు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు చిన్నారావు పిలుపునిచ్చారు. బుధవారం నర్సీపట్నం బీఎస్పీ పార్టీ నియోజకవర్గ సమావేశం పార్టీ కార్యాలయంలో బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ,అన్ని గ్రామ పంచాయతీలోని బూత్ స్థాయి వరకు పార్టీని తీసుకువెళ్లి 2024లో గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. నియోజకవ ఇన్చార్జ నాగరాజు మాట్లాడుతూ, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లవలసిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు తనుజ, నియోజకవర్గం నాయకులు గంగా ధర, చిరంజీవి, సంజీవ్, ప్రకాష్, కృష్ణ, సూరిబాబు, పట్టాలు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మనప్రభుత్వం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిలెం గ్రామంలో డిసెంబరు 1న గడపగడపకుమన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్గణేష్ హాజరవుతారన్నారు. మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపిపి, వైస్ ఎంపీపీలు, ఎంపిటిసిలు, సర్పంచులు, కోఆపరేటివ్ బ్యాంకు ప్రెసిడెంట్లు, పార్టీ ముఖ్య నేతలు, యువత, మహిళా విభాగం కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక శ్రీ కృష్ణ ప్యాలెస్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో అనేక భూ సమస్యలు ఉన్నాయని, వీటిని పరిష్కరించాలని డిమాండ్ చేశాఉరు. అటవీ హక్కుల చట్టం అమలు జరగలేదని, మైదాన ప్రాంత గిరిజనులకు న్యాయం చేయ లేదన్నారు. ప్రభుత్వాలు పేదలకు భూ పంపిణీ చేయలేదని, కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడుకోలేని పరిస్థితిలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ పథకాన్ని నవరత్నాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర సందర్భంలో పేదలందరికీ ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇస్తాననని చెప్పి కేవలం 1,80,000 మాత్రమే ఇస్తే పేదలు ఇల్లు ఎలా కట్టుకోగలరని అని ప్రశ్నించారు. జగనన్న ఇళ్ల కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్తు, మౌలిక వసతులు కరువయ్యాయని దుయ్యబట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో పేదలు ఎలా బతకాలని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నేత శేఖర్

సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, రైతులకు మద్దతుగా పోరాటాలు చేయవలసిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, సంఘం జిల్లా బాధ్యులు మాకిరెడ్డి రాము నాయుడు, రైతు సంఘం అనకాపల్లి జిల్లా బాధ్యులు జి.గురు బాబు, కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా సీనియర్ ఉపాధ్యక్షులు పి.తాతబ్బాయి పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులుగా పాలపర్తి తాతబ్బాయి, అధ్యక్షుడు గా శివలంక కొండలరావు, ప్రధాన కార్యదర్శి గా మాకిరెడ్డి రామునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు సోషల్ ఆడిట్

ప్రజాశక్తి- మాకవరపాలెం: మండలంలో నిర్వహించిన ఉపాధి పనులపై ఈనెల 1న గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు.

సత్యనారాయణకు ఘన సన్మానం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఎర్రవరం సమీప అడవిరాజుబాబుల గుడి వద్ద బుధవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్గణేష్ మాట్లాడుతూ, మండలంలో రైతులకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారంలో మెరుగైన సలహాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు సుర్లల ఆదినారాయణ, జక్కు నాగమణి, మండల మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిటిసిలు, సర్పంచ్లు పాల్గొన్నారు.


సత్యనారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

సిఐటియు మహాసభల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల 18, 19 తేదీల్లో పరవాడలో జరిగే సిఐటియు 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి సత్తిబాబు కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక ఐదు రోడ్ల సెంటర్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించి, కార్మిక చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్మికుల సమస్యలను చర్చించి పోరాటం రూపొందిస్తామన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు అందరూ సహకరించాలని, 18వ తేదీన జరిగే ప్రదర్శనలో కార్మికుల పాల్గొనాలని సత్తిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొర్రా శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, వరలక్ష్మి, ప్రసాదు, బాలరాజు పాల్గొన్నారు.

సర్పంచుల అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి-కోటవురట్ల:తిరుపతిలో సర్పంచుల అరెస్టు హేయమైన చర్య అని టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చేసేందుకు సర్పంచులు ఎంతో ఉత్సాహంగా ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారన్నారు.పంచాయతీల నిధులు దోచుకోవడం దారుణమని, కనీసం గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ కష్టమవుతుందన్నారు. వారి నిధులు కోసం పోరాడుతుంటే అరెస్టు చేయడం దారుణన్నారు. ఈ కార్యక్రమంలో రాజుపేట సర్పంచ్ బివి రమణ, టిడిపి నేతలు సత్యనారాయణ, సుంకర బాబ్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేతలు

త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:ఈనెలలో నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహనరెడ్డి నేతుల మీదుగా రూ. 1000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే పిల్ల శంకర్ గణేష్ తెలిపారు. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం గ్రామంలో 500 కోట్ల వ్యయంతో నిర్మించే మెడికల్ కళాశాల భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఏలూరు కాలువ నీటిని తాండవ రిజర్వాయర్ సరఫరా చేసేందుకు చేపట్టే రూ.475 కోట్ల రూపాయల ప్రాజెక్టుకు కూడా సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం నర్సీపట్నం ఆర్డీవో జయరాం పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు అడుగు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జడ్పిటిసి గిరిబాబు, ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఆనంద్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

గురజాడకు ఘన నివాళి

ప్రజాశక్తి -యస్.రాయవరం:మహాకవి గురజాడ సేవలు చిరస్మరణీయమని జెడ్పీటిసి కాకర దేవి కొనియాడారు. గురజాడ జన్మస్థలం యస్.రాయవరంలో ఆయన వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గురజాడ ఫౌండేషన్ నేతృత్వంలో గ్రామ నాయకులు బొలిశెట్టి గోవిందరావు, బృంద సభ్యులు గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కన్యాశుల్కం నాటి సమాజంలోని పరిస్థితులను నేటికి కళ్ళకు కట్టినట్లు చూపిస్తుందన్నారు. ఆనాడే గురజాడ బాల్య వివాహాల పట్ల తన భావాలను నిర్ద్వంధంగా తెలిపారన్నారు.అనంతరం స్కూల్ పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్రి వెంకటేశ్వరరావు మాస్టర్, ఏపీ, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ ఎన్.వి అనంతకృష్ణ, కవి చింత రామకృష్ణారావు, వేగి మురళీకృష్ణ, కొణతాల శ్రీనువాసరావు, కర్రి ధనరెడ్డి, బొలిశెట్టి సర్పంచ్ భూపతి అప్పారావుచ, లక్కోజు ఆదిమూర్తి శ్రీనువాసరావు పాల్గొన్నారు.



భీమిలిలో..

భీమునిపట్నం : స్థానిక పండిట్ నెహ్రూ జివిఎంసి ఉన్నత పాఠశాలలో గురజాడ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి హెచ్ఎం తిరుమల శ్రీదేవి, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

గాజువాక : నవయుగ వైతాళికుడు గురజాడ అని జనవిజ్ఞాన వేదిక విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వికె.పరశరామ్ అన్నారు. సుందరయ్య కాలనీ, రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్లో గురజాడ వర్ధంతిలో పాల్గొని నివాళు లర్పించారు. ఇన్‌చార్జిలు సుజాత, కిరణ్మయి పాల్గొన్నారు. అప్పన్న, దేవుడమ్మ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ పురస్కారం ఇవ్వడాన్ని ఖండించారు.



ఎస్.రాయవరంలో నివాళులర్పిస్తున్న గ్రామ నాయకులు

ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన...

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు చిరంజీవి అన్నారు. గురజాడ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గురజాడ విగ్రహానికి ఎఐఎస్ఎఫ్, ప్రజానాట్యమండలి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు.నాగరాజు, ప్రజానాట్యమండలి నాయకులు



గాజువాకలో...

హక్కుల కోసం పోరాడితే అక్రమ అరెస్టులు దుర్మార్గం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

హక్కుల కోసం పోరాడితే యుటిఎఫ్ నాయకులను గృహనిర్బంధాలు, అరెస్టు చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాగమణి, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి పేర్కొన్నారు. పెండింగు బకాయిల విడుదలకై తలపెట్టిన యుటిఎఫ్ రాష్ట్రస్థాయి ధర్నాను భగ్నం చేసేందుకు పోలీసులు అనుసరించిన ధమనకాండను నిరసిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన జాగరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు నిరసన జాగరణ ఉంటుందని నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్లు, పెండింగ్ బకాయిల విడుదలకై రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమాన్ని విజయవాడలో చేపట్టాలని నిర్ణయించి, ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు తరలి వస్తుంటే ఎక్కడికక్కడ గృహనిర్బంధాలు చేయడం, నోటీసులు ఇవ్వడం, అరెస్టులు చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు ఒడిగట్టారని విమర్శించారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రతి ఆర్థిక బెనిఫిట్‌నూ ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఇతర బోధనేతర పనుల నుంచి కూడా తప్పించాలన్నారు. ఉపాధ్యాయుల పోరాటానికి భయపడి ఎన్నికల విధుల నుంచి తప్పించారని తాము భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాన అప్పారావు, అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, కోశాధికారి అంబేద్కర్, విశాఖ జిల్లా మాజీ కార్యదర్శి నెల్లి సుబ్బారావు, మాజీ ప్రధాన కార్యదర్శి వైఆర్‌కె ప్రసాద్, కొత్తపల్లి రాంబాబు, సింహాచలం, జగన్, ఎం.రామకృష్ణ, రాంబాబు, గణపతి, కందివలస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరసన జాగరణలో యుటిఎఫ్ నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ నిరసన జాగరణ శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ప్రజాస్వామిక విలువలను ప్రభుత్వం కాలరాయడం మంచిది కాదన్నారు. ఉపాధ్యాయుల ఉద్యమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-మాకవరపాలెం: ఓటు హక్కు వజ్రాయుధని, 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో జయరాం కోరారు. బుధవారం అవంతి కాలేజీలో యువత ఓటర్ల నమోదుపై చైతన్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, అర్హత ఉన్న యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అవంతి కాలేజ్ ప్రిన్సిపాల్ మోహన్ రావు, తహసిల్దార్ ప్రసాదరావు, డిటి శంకర్రావు, ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



హాజరైన ఆర్‌డిఒ

వినయ్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:స్థానిక వినయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. విజేతలను డిసెంబర్ రెండో వారంలో నిర్వహించే మండల స్థాయి పోటీలకు పంపుతామని జన విజ్ఞాన వేదిక ప్రతినిధి ప్రసాద్ తెలిపారు. ఉపాధ్యాయులు సైన్స్ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో వినయ విద్యా సంస్థ కర్రస్పాండెంట్ వాసు పాల్గొన్నారు.



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అమృత వర్షినికి అభినందనలు

ప్రజాశక్తి -కోటవురట్ల:ఇటీవల నిర్వహించిన అగ్రిసెట్ పరీక్షలలో రాష్ట్రవ్యాప్తంగా 8వ ర్యాంకు సాధించిన అమృత వర్షినిని బుధవారం మండల వాకర్స్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, వాకర్స్ కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు సత్యాడ దాసు, రవి మాస్టారు, జిల్లా పరిషత్ పాఠశాల జూనియర్ అసిస్టెంట్ చిరంజీవి, డిసిసిబి బ్యాంక్ క్యాషియర్ సందీప్ రాజు, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పౌరహక్కుల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాతకృష్ణదేవి పేటలో బుధవారం పౌరహక్కుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కులాల ప్రయోజనాలు, వారికి ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ, విద్వేశాలకు తావు లేకుండా సమాజంలో అందరూ ఆనందంగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, గ్రామ సర్పంచ్ పందిరి సత్యంనాయుడు, ఉప సర్పంచ్ సహదేముడు, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నుంచి అప్పారావు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్



బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ సారా. సీతయ్య తెలిపారు. బుధవారం పంచాయతీలో తాగునీటి సదుపాయాలు కల్పించేందుకు పనులను శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి కాలం ముందస్తుగానే బోర్లు ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయం కల్పించేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నామన్నారు. మొదటి విడతగా కొత్తూరు, శివలింగపురం, కొత్తూరు కొత్తవలస గ్రామాల్లో పూర్తి చేశామని, మిగతా మూడు గ్రామాలకు రెండో విడతగా బోర్లు ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వరలక్ష్మి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్

ప్రజాశక్తి -పాడేరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ మాట్లాడుతూ, సైన్స్ పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకొని రానున్న కాలంలో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. పర్యావరణం, వ్యవసాయం, ఆరోగ్యం, కాలుష్య నియంత్రణపై అవగాహన పెంచుకొనిా జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి ప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్సు రామారావు, రమణ మూర్తి నాయుడు, జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిఒ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: ప్రభుత్వ ఉద్యోగుల ఏపీ ఎన్జీవో అరకు యూనిట్ నూతన కమిటీ ఎన్నిక అరకులోయలో బుధవారం ఎన్నికైంది. ఆ సంఘం అరకు యూనిట్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్వైజర్ గా పని చేస్తున్న పి.సాంబశివరావు, ట్రెజరర్‌గా హరికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మురళి, స్వామి, రవీంద్ర, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ మహాసభలకు సహకరించినందుకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కర్నూలులో నవంబర్ 28, 29 తేదీలలో జరిగిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర నాలుగవ మహాసభలు విజయవంతంగా ముగిశాయని, ఇందుకు సహకరించిన వారందరికీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షునిగా ఎన్నికైన టి.చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహాసభలకు విశాఖపట్నం జిల్లా నుంచి 10 మంది ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు. జిల్లాకు చెందిన భాగం లక్ష్మి అధ్యక్ష వర్గంలో పాల్గొన్నారని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి బుడమూరి జగదీష్ విశాఖ జిల్లా నివేదిక సమర్పించారని చెప్పారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ మహాసభలో స్టీల్ ప్లాంట్ పూర్వపు ఉద్యోగి, జిల్లా కెవిపిఎస్ ఉపాధ్యక్షుడు కె.వెంకటరావు తీర్మానం ప్రవేశపెట్టగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. అనంతరం జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి టి.చిరంజీవి, మద్దెల సుబ్బన్న, భాగం లక్ష్మి, ముద్దాడ వరప్రసాదరావు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

యుటిఎఫ్ నేతల అరెస్టులు అన్యాయం



మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి పాడేరు : విజయవాడ లోని ధర్నా చౌక్‌లో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులను అరెస్టు చేయడం, నిర్బంధించడం అన్యాయమని యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి మహేష్ ఖండించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తాము పొదుపు చేసుకున్న వాటిని తమ కుటుంబ అవసరాలకు లోన్లు అడిగితే ఉపాధ్యాయులను అరెస్టులు చేయడం అన్యాయమని దీన్ని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరుతున్నామన్నారు. ఇటువంటి ప్రభుత్వాలకు భవిష్యత్తులో ప్రజలే గుణపాఠం చెపుతారని ఘనమైన చరిత్ర కలిగిన నాయకులే కాల గర్భంలో కలిసి పోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సి హెచ్ నాగేశ్వరరావు పాడేరు మండల నాయకులు ఎస్ ఎస్ కర్రి బాబు ఎన్ కొండబాబులు పాల్గొన్నారు.

పాడేరు: రాష్ట్రంలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఎఫ్, డిఎ, ఎరియర్స్ తదితర బకాయిలు చెల్లించాలని బుధవారం విజయవాడ ధర్నాచౌక్‌లో ఉపాధ్యాయులు తలపెట్టిన ధర్నాను అడ్డుకొని అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్సత బుధవారం ప్రకటన విడుదల చేశారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు 650 కోట్లు మార్చి 2022నాటికి ఇస్తామని మంత్రివర్గం ఉపసంఘం సమక్షంలో హామీ ఇచ్చి విస్మరించారన్నారు. నేటి వరకు పూర్తి బకాయిలు చెల్లించలేదన్నారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.ఎస్.వి. ప్రసాద్, అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లతో సహా 250 మందికిపైగా అరెస్టు చేశారన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు బకాయిలు చెల్లించకుండా వారిపై నిర్బంధాన్ని ప్రయోగించడం గర్హనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలు మానుకుని ఉద్యోగులకు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

డుంబ్రిగూడ: ఉపాధ్యాయుల డీఏలు, ఎపిజిఎల్‌తో పాటు బకాయిల సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో ఆందోళన చేపట్టడానికి ముందు గానే పోలీసులు ఉపాధ్యాయులను అరెస్టు చేయడం తగదని యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఎస్.కన్నయ్య తీవ్రంగా ఖండించారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఆందోళన కార్యక్రమానికి ముందుగానే ప్రభుత్వం నుంచి అనుమతి కూడా తీసుకోవడం జరిగిందన్నారు. అయినా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ ఉపాధ్యాయులను పోలీసులతో అరెస్టు చేసి నిర్బంధించడం, బైండోవర్లు కేసు నమోదు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా ఇటువంటి అరెస్టులు, నిర్బంధాలతో ఉపాధ్యాయుల పోరాటాన్ని ఆపలేరని తెలిపారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎస్.బాలకృష్ణ, ఎం.చంద్రరావు, ఎల్బీ దుక్కు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: శాంతియుతంగా విజయవాడలో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులను అరెస్టు చేసి నిర్బంధించడం సరికాదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ధర్మారావు తీవ్రంగా ఖండించారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, అరెస్టులు చేయడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. అన్ని బకాయిలు సంవత్సరం పైబడి ఉన్నాయన్నారు. ఈ అన్యాయాన్ని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఆర్. పుండరీ, మండల నాయకులు గోపీ, రాజు, ధనుపతి పాల్గొన్నారు.

అనంతగిరి: అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని యుటిఎఫ్ నాయకులు వివి ఈశ్వరరావు, పి.దేవుడు, శెట్టి రాంబాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అక్రమ అరెస్టులు చేపట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి

టిడిపి మండల అధ్యక్షుడు బాబూరావు

ప్రజాశక్తి-అరకులోయ: వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని అరకులోయ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు విమర్శించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం ఆవరణలో బుధవారం జగన్ రెడ్డి పాలనపై 'ఇదేం కర్మ' మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రవేశపెట్టిన 18 సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసిందన్నారు. వైసిపి అసమర్థత పాలనతో రాష్ట్రానికి కి వచ్చిన పరిశ్రమలన్నీ తరలి పోతున్నాయని తెలిపారు. పెట్టుబడిదారులంతా పారిపోతున్నారని ఆక్వా రంగం నిర్వీర్యమైందని పేర్కొన్నారు. ఎస్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, కార్పొరేషన్ నిధులు దారి మళ్లించి గిరిజన అభివృద్ధి కుంటిపడేలా చేసిందన్నారు. ఎస్టీలకు విదేశీ విద్య నిధులు దారి మళ్లించిదన్నారు.ఏ గ్రామాన్ని చూసినా అభివృద్ధి జాడే కనిపించలేదని, తెలుగుదేశం హయాంలో చేసిన పనులే దర్శనమిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. మన్య ప్రాంతంలో కనీసం ఒక డ్రైనేజీ, సిసి రోడ్లు, మంచినీటి పథకాలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఇటువంటి తరుణంలో తెలుగుదేశం పార్టీని బలపరిచి రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజలకు మనుగడ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు సియ్యారి దొన్నుదొర, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, పొద్దు అమ్మన్న, సుబ్బారావు, బొరిబొరి లక్ష్మి, వనాది, సాయిరాం, ద్రౌపతి, ఇచ్చవతి, కళ, నీరజ, రమేష్, కుమార్ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షుడు బాబురావు

ప్రభుత్వం ఇచ్చిన విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

ఏపి రైతు సంఘం నాయకులు సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు సీతారామయ్య

ప్రజాశక్తి- చింతూరు : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వరి విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కుంజా సీతారామయ్య డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకుల నాయకుడు మడకం రమేష్ అధ్యక్షతన జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వరి విత్తనాలతో రైతులు నష్టపోయారన్నారు. కొంత మేరకు పండిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వరదలలో నష్టపోయిన వరద బాధితులకు నష్టపరిహారం ప్రభుత్వం వెంటనే ఇచ్చి ఆందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కోసం వీరయ్య, ముట్టం కిట్టయ్య, కొరస ఎర్రయ్య సవలం దే సయ్య, మడకం చిన్నయ్య, పెనుబల్లి వెంకయ్య, మొట్టం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన నీటిని అందించండి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రజలకు సురక్షితమైన తాగు నీటిని అందించాలని జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు రిజర్వాయర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రిజర్వాయర్ల వద్ద పంపింగ్‌లో ఎటువంటి లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలన్నారు. పంపింగ్‌లో విద్యుత్ ఆటంకం కలిగితే జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. నీటి శుభ్రత విషయంలో రాజీ లేకుండా రీడింగ్ తీసి రికార్డుల్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

జివిఎంసి బడ్జెట్‌పై రెండో రోజూ సమీక్ష

ప్రజాశక్తి-విశాఖపట్నం : 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను స్థాయి సంఘంలో చర్చించామని, దానిని కౌన్సిల్ ఆమోదం కోసం పంపేందుకు సిద్ధం చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్థాయీ సంఘ సభ్యులు, జివిఎంసి ఉన్నతాధికారులతో 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై వరుస రెండవ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వాస్తవానికి అనుగుణంగా 2023-24 ఆర్థిక బడ్జెట్ రూపకల్పనలో భాగంగా బడ్జెట్ లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి బడ్జెట్ అంచనాలను తయారు చేసి స్థాయి సంఘంలో ఆమోదించమని, దానిని కౌన్సిల్ కి నివేదించాలని ఆదేశించారు. జివిఎంసి ఆదాయ, వ్యయాలపై చర్చించిన పిదప తుదిగా ప్రతి అంశాన్ని పొందుపరచి ప్రజలకు అవసరమైన చోట్ల అభివృద్ధి, సంక్షేమం అమలయ్యేలా రూపొందించామన్నారు.


బాకర్లం అఫ్రీన్, తబస్సుమ్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విజయనగరంలో నవంబర్ 27న జరిగిన సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన అఫ్రీన్, నవంబర్ 29న జరిగిన అండర్ 17 స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన తబస్సుమ్‌ను బుధవారం టిడిపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్ అభినందించారు. ఇద్దరు అక్కాచెల్లెళ్లకు పౌష్టికాహారం, బాక్సింగ్ కిట్లు కోసం రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు.

నేవీ డే రిహార్సల్స్ దృశ్యమాలిక

ఈ నెల 4న నేవీ డే సందర్భంగా ఆర్‌కె.బీచ్‌లో బుధవారం నావికా సిబ్బంది రిహార్సల్స్ నిర్వహించారు.







'ఉక్కు' ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు గంధం వెంకటరావు, అయోధ్యరామ్, కారునాయుడు, సిహెచ్ సన్యాసిరావు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 657వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి నాయకులు మాట్లాడుతూ, ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరి రక్షణ సాధ్యమన్నారు. 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. ప్రధాని మోడీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు సాగిస్తామని స్పష్టంచేశారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరి రక్షణకు ప్రతిఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షల్లో కార్మిక నేతలు, కార్మికులు డి.దేముడు, జి.ఆనంద్, డి.రమేష్, ఆర్.ధనరాజు, జివి.రమణారావు, వైవి.సుబ్బారావు, ఎం.సుబ్బారావు, ఆర్.సూరిబాబు, కెవి.రమణ, వి.కృష్ణంనాయుడు, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సిఎన్‌సి ఆపరేటర్ టర్నింగ్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఆంధ్ర యూనివర్సిటీలోని సిమెన్స్‌లో సిఎన్‌సి ఆపరేటర్ టర్నింగ్ 2వ కోర్సు ప్రారంభిస్తున్నారు. మూడు నెలలు ఉండే ఈ కోర్సుకు 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ చదివినవారు అర్హులని నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 7661872926 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రపంచాన్ని నడిపించే శక్తి మహిళల సొంతం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రపంచాన్ని నడిపించే శక్తి మహిళల సొంతమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శివాజీపాలెంలోని ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సౌత్ ఏషియా ఎల్‌పిజి కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మించిన హాస్టల్ భవన సముదాయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏయూ కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. ఎస్ఎ ఎల్‌పిజి సంస్థ సామాజిక బాధ్యతగా ఏయూలో హాస్టల్ భవనం నిర్మించడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఏషియా ఎల్‌పిజి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ సంజయ్ కుమార్ గుహ , ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిబిసిఎన్‌సి స్థలం టిడిఆర్‌పై నిలదీత

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : గజం స్థలం పోకుండా సిబిసిఎన్‌సి స్థలానికి టిడిఆర్ ఎలా ఇస్తారని టౌన్ ప్లానింగ్ అధికారులను జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ నిలదీశారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు సురేష్ కుమార్, సంజీవ్ కుమార్ సరైన జవాబు ఇవ్వలేకపోయారు. నగరంలో వివాదాస్పద సిబిసిఎన్ సి స్థలానికి రూ.62కోట్ల టి డి ఆర్ మంజూరు విషయంపై బుధవారం ఉదయం "టౌన్ ప్లానింగ్ స్పందనలో" మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. సిబిసిఎన్‌సి స్థలం కోర్టు వివాదాల్లో ఉండడంతో పాటు, స్థలంపై యాజమాన్య పూర్తి హక్కు రాకుండా ఏ విధంగా టిడిఆర్, ప్లాన్ మంజూరు చేస్తారని మూర్తి యాదవ్ ప్రశ్నించారు.

నేవీ డేతో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : నేవీ డే-2022 సందర్భంగా విశాఖపట్నంలో ఈ నెల 4వ తేదీన ఆర్‌కె.బీచ్ రోడ్డులో ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు నౌకాదళ యుద్ధ విన్యాసాల నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భారత రాష్ట్రపతి, మరికొంతమంది ప్రముఖులు రానున్న సందర్భంగా ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాధారణ వాహనదారులు పాటించాల్సిన నిబంధనలు వివరించారు. కలెక్టరేట్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ, నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ వరకు, సిరిపురం జంక్షన్ నుంచి చినవాల్తేరు మీదుగా పార్క్ హోటల్ వరకు, సిరిపురం జంక్షన్ నుంచి ఆలిండియా రేడియో జంక్షన్ మీదుగా ఎన్‌టిఆర్ విగ్రహం వరకు, ఆలిండియా రేడియో జంక్షన్ నుంచి పాండురంగాపురం డౌన్ వరకు, నేవల్ క్యాంటీన్ జంక్షన్ నుంచి నేవల్ కోస్ట్ బ్యాటరీ వరకు, పందిమెట్ట జంక్షన్ నుంచి నోవాటెల్ హోటల్ వరకు, సెంచరీ క్లబ్ నుంచి నోవాటెల్ హోటల్ వరకు పాస్ లేని వాహనాలకు అనుమతి లేదని వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : జెవి రత్నం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం కోరారు. బుధవారం ఉదయం ఎంవిపి కాలనీలోని సెవెంత్ డే ఏడవంటిస్ట్ హై స్కూల్, సితమ్మధార లోని జివిఎంసి నెహ్రు హైస్కూల్‌లో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి, ప్రమాదాలు నివారించాలి అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెవెంత్ డే విద్య సంస్థ ప్రతినిధి విజయానంద్, జివిఎంసి ఉపాధ్యాయులు ప్రభావతి పాల్గొన్నారు.

అదనపు కమిషనర్‌గా రమణి సేవలు అమోఘం

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి అదనపు కమిషనర్‌గా అవ్వారి వెంకట రమణి సేవలు అమోఘమని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. జివిఎంసి అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న అవ్వారి వెంకట రమణిని బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. ఆమె సేవలను అందరూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, స్థాయీ సంఘ సభ్యులు, జివిఎంసి ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పిఒకు సిపిఎం వినతి



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు, మహిళలు

ప్రజాశక్తి-కూనవరం

వఖండలంలోని పలు సమస్యలపై సిపిఎం నాయకులు ఐటిడిఎ పిఒకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలను సర్వే చేసిన వాటికి నోటిఫికేషన్లు విడుదల చేయాలని, ముంపునకు గురవుతున్న భూములకు సంబంధించిన నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముంపు గ్రామాలను సర్వే చేసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, నోటిఫికేషన్ విడుదల చేసిన గ్రామాలకు తక్షణమే ప్రభుత్వం ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. గండి కొత్త గూడెం రోడ్డు, వంతెనలు పూర్తి చేయాలని, గ్రామాల్లో వీధి రోడ్లు నిర్మించాలని, రెండో దశ తారు రోడ్లు నిర్మించాలని కోరారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, గిరిజనులపై ఫారెస్ట్ అధికార్లు వేధింపులు ఆపాలని డిమాండ్ చేశ్వారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీ డి.అమ్మాజి, సర్పంచులు సోడే శంకర్, బోగ్గ వెంకమ్మ, ఎం నాగమణి, బొగ్గా రామారావు, సీపీఎం నాయుకలు మేకల నాగేశ్వరావు, తెల్లం తమ్మయ్య, ఎం బాబూరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనుల వేగవంతం : హౌసింగ్ పీడీ



పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శ్రీనివాస్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

2021 -22 ఏడాదిలో మంజూరైన గృహాల నిర్మాణ పనులు లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ బిహెచ్.శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం అడ్డతీగల, రాజవొమ్మంగి మండలంలోని చెరుకుంపాలెం, మెట్లపాలెం గ్రామాల్లో హౌసింగ్ స్కీమ్‌లో లబ్ధిదారుల గృహ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గృహ నిర్మాణ పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తిచేసేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ఎంవివి నరసింహారావు, ఏఈ చలపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మాట మంతి కార్యక్రమం ద్వారా తెలుగు మహిళలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరకపోవడం, పెట్రోలు గ్యాస్ పెంపు వల్ల పేద బడుగు బలహీన వర్గాలపై ఎలా భారాలు పడుతున్నాయో వివరించాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర నాయకులు బొర్రా విజయరాణి, తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి సుకల రమణమ్మ, నాయకులు పోతల రమణమ్మ, వేదుల సూర్య ప్రభ తదితరులు పాల్గొన్నారు.